ప్రజాశక్తి

గురువారం 5 డిసెంబర్ 2024 | 8 పేజీలు



ఎన్‌టిఆర్


కృష్ణా

స్వల్ప భూప్రకంపనలు

ప్రజాశక్తి - యంత్రాంగం : ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లో బుధవారం ఉదయం భూమి స్వల్పంగా కంపించింది. ఉదయం 7.30 గంటల సమయంలో కన్ను మూసి కన్ను తెరిచేలోగా ఇళ్లలో సామాన్లు కదలటం, కుర్చీలో కూర్చున్న వారి కాళ్లు వణకటంతో ప్రజలు భయాందోళన గురయ్యారు. కొన్ని చోట్ల ఇళ్లు ఊగి ఇంట్లో సామాన్లు కదిలాయి. ఇళ్లు, అపార్ట్‌మెంట్ల నుంచి ప్రజలు ప్రాణభయంతో బయటకు పరుగులు పెట్టారు. కొన్ని చోట్ల నిమిషం పాటు స్వల్పంగా భూమి కంపించింది. ఉదయం 7.30 గంటల సమయంలో భూమి కంపించింది.

వార్త 4లో


తిరువూరులో నెర్రెలిచ్చిన ఇంటి గోడ

6 నుండి 'కృష్ణవేణి సంగీత నీరాజనం'

● హాజరుకానున్న కేంద్ర మంత్రులు

ప్రజాశక్తి - విజయవాడ : భారతదేశ చరిత్ర, సంస్కృతి, కళలు ప్రతిబింబించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పర్యాటక, సాంస్కృతిక శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 6, 7, 8 తేదీల్లో విజయవాడ తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో 'కష్ణవేణి సంగీత నీరాజనం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు నిర్మల సీతారామన్, గజేంద్ర సింగ్ షెకావత్, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పాల్గొంటారని తెలిపారు. విజయవాడలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత నత్య కళాశాలలో ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ ఎపి నుండే కాకుండా ఇతర రాష్ట్రాల నుండి కళాకారులు కార్యక్రమానికి వస్తారని తెలిపారు. సిఎం, డిప్యూటీ సిఎం


మీడియాతో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

చొరవతో కేంద్ర ప్రభుత్వ పథకం సాస్కి (స్పెషల్ అసిస్టెన్స్ ఫర్ కేపిటల్ ఇన్వెస్ట్‌మెంట్) ద్వారా అఖండ గోదావరి, గండికోట అభివద్ధికి రూ.177 కోట్లు మంజూరు చేసిందన్నారు. జనవరి నుండి వీటి పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. అఖండ గోదావరి ప్రాజెక్టులో భాగంగా హేవలాక్ వంతెన పునర్నిర్మాణం, అధ్యాత్మిక కేంద్రంగా పుష్కర్ ఘాట్ అభివద్ధి, నిడదవోలు కోట సత్తెమ్మ ఆలయానికి సరికొత్త శోభ, హేవలాక్ వంతెన ప్రాంతంలో గ్లాస్ వంతెనలు, వాటర్ స్పోర్ట్స్... పర్యాటకులు (మిగతా 2లో)

బిల్లు...గొల్లు...

● విద్యుత్ సర్దుబాటు ఛార్జీలతో వినియోగదారులు బెంబేలు
● రూ.100 నుంచి రూ.500 వరకు పెరుగుదల

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

కూటమి ప్రభుత్వం విద్యుత్ వినియోగదారులపై పెను భారం మోపింది. విద్యుత్ సంస్థలకు ఎప్పుడో వచ్చిన నష్టాలను సాకుగా చూపుతూ ఈ నెలలో జారీ చేసిన విద్యుత్ బిల్లుల్లో వినియోగదారులపై మరో సర్దుబాటు భారం వేసింది. 2022 ఏప్రిల్‌లో వినియోగించిన విద్యుత్‌కు సర్దుబాటు ఛార్జీలను (ఎఫ్‌పిపిసిఎ) 2024 నవంబర్ బిల్లులతో కలిపి ఇస్తున్నారు. గతం నుంచి వస్తున్న సర్దుబాటు ఛార్జీలకుతోడు మరోసారి సర్దుబాటు ఛార్జీలు విధించడంతో వినియోగదారులు బెంబేలెత్తుతున్నారు. ఫలితంగా అక్టోబర్‌కన్నా నవంబర్ బిల్లులు అధికంగా వచ్చాయి. ఒక్కొక్కరికి ఒక్కో విధంగా రూ.100 నుంచి రూ. 500 వరకు అదనంగా బిల్లులు వస్తున్నాయి. డిసెంబర్‌లో ఈ బిల్లులను వినియోగదారులు చెల్లించాల్సి ఉంది. కరెంటు బిల్లులు చూసి వినియోగదారులు గొల్లు మంటున్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో వినియోగానికిగాను ఈ ఎఫ్‌పిపిసిఎ భారాలను మరో 15 నెలలపాటు భరించాల్సి ఉంటుంది.

6.21 లక్షల మంది వినియోగదారులపై భారం

కృష్ణా జిల్లాలో మొత్తం 7 లక్షల 53 వేల 809 విద్యుత్ కనెక్షన్లున్నాయి. గృహ విద్యుత్ కనెక్షన్లు 6 లక్షల 21 వేల 578 ఉన్నాయి. వినియోగదారులందరిపై ఈ సర్దుబాటు ఛార్జీల బారం పడనుంది. ఇప్పటి వరకు ఒక ట్రూ, ఒక ఎఫ్‌పిపిసిఎ భారాన్ని వినియోగదారుడు చెల్లిస్తున్నారు. తాజాగా మరో ఎఫ్‌పిపిఎ భారాన్ని బిల్లులో చేర్చారు. వాతావరణ పరిస్థితులను అనుసరించి గృహ విద్యుత్ వినియోగంలో హెచ్చుతగ్గులు ఉంటాయి. సగటున నెలకు 5 కోట్లా 95 లక్షల 35 వేల 43 యూనిట్లు వినియోగిస్తున్నారు. ఈ మొత్తానికి అసలు ఛార్జీలతో పాటు ట్రూ అప్‌లు, సర్దుబాటు ఛార్జీలు వివిధ రూపాల్లో విధిస్తోంది. గత వినియోగానికి సంబంధించి వినియోగదారులు ప్రస్తుత బిల్లులో యూనిట్‌కు రూ.1 నుంచి రూ.0.70 పైసల వరకు చెల్లించాల్సి వస్తోంది.

ట్రూ అప్‌లు..ఎఫ్‌పిపిసిఎలు

గుడ్లవల్లేరు మండలం కౌతవరం గ్రామానికి చెందిన పడమటి వెంకటేశ్వరరావు విద్యుత్ గృహ సర్వీసు నెంబర్ 27779883 మీటరులో నవంబర్లో 145 యూనిట్ల విద్యుత్ వినియోగం జరిగింది. మినిమమ్ ఎనర్జీ ఛార్జీలు రూ.555, ఫిక్స్‌డ్ ఛార్జీలు రూ.10, ఎలక్ట్రిసిటీ డ్యూటీ రూ.8.88, కస్టమర్ ఛార్జీలు రూ.50, ట్రూ అప్ ఛార్జీలు (29/36) రూ.34.61, ఎఫ్‌పిపిఎ ఛార్జీలు (4/22) రూ.104.73, ఎఫ్‌పిపిఎ ఛార్జీలు (10/24) రూ.53.20 బిల్లులో చూపారు. మొత్తం చెల్లించాల్సింది రూ.816గా చూపారు. అక్టోబర్లో 143 యూనిట్ల విద్యుత్ వినియోగించినందుకుగాను బిల్లు రూ.651 వచ్చింది. అక్టోబర్ బిల్లుతో పోలిస్తే నవంబర్లో వినియోగానికి రూ.165 ఎక్కువగా చెల్లించాల్సి వస్తోంది. పెడన పట్టణంలో బిపి కనకయ్య సర్వీసు నంబర్ 624400001860 మీటరులో అక్టోబర్‌లో 167 యూనిట్లు విద్యుత్ వినియోగించిందుకుగాను నవంబర్లో రూ.755 బిల్లు చెల్లించారు. అలాగే నవంబర్లో 151 యూనిట్లు విద్యుత్ వినియోగించినందుకుగాను డిసెంబర్లో రూ.856 బిల్లు చేతికి వచ్చింది. కనకయ్య రూ.101 అదనంగా చెల్లించాల్సి ఉంది. ఇప్పటి వరకు బిల్లులు చేతికొచ్చిన వినియోగదారులందరి పరిస్థితి ఇలాగే ఉంది. 2022 ఏప్రిల్ వినియోగం ప్రామాణికంగా తీసుకున్నప్పుడు కొందరికి రూ.500 పైగా అదనంగా బిల్లులు వస్తున్నాయని వినియోగదారులు వాపోతున్నారు.



సర్వీసు నంబర్ 624400001860 నవంబర్, డిసెంబర్ బిల్లులు

తెల్ల పొణికి కొరతపై ప్రత్యేక జాయింట్ కమిటీ

● కొండపల్లి బొమ్మల కళాకారులతో కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : తెలుగు నేల సంప్రదాయ కళా ఔన్నత్యానికి కొండపల్లి బొమ్మలు చిహ్నమని, సమష్టి కషితో కొండపల్లి బొమ్మ కళకు పునర్వైభవం తెస్తామని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. కలెక్టర్ లక్ష్మీశ... బుధవారం డీఆర్‌డీఏ, డ్వామా, అటవీ, రెవెన్యూ శాఖల అధికారులతో కలిసి కొండపల్లి బొమ్మల కళాకారుల సహకార సంఘం సభ్యులతో సమావేశమయ్యారు. బొమ్మల తయారీకి వినియోగించే తెల్ల పొణికిని, కళాకారులు అద్భుత నైపుణ్యంతో చెక్కను అందమైన బొమ్మగా తీర్చిదిద్దుతున్న విధానాన్ని పరిశీలించారు. కొండపల్లి బొమ్మల తయారీ దారులతో కలెక్టర్ ముఖాముఖి మాట్లాడారు. అనంతరం కలెక్టర్ మీడియతో మాట్లాడుతూ దేశ, విదేశాల్లో ప్రత్యేక గుర్తింపు ఉన్న కొండపల్లి బొమ్మలకు డిమాండ్‌తోపాటు మార్కెటింగ్ అవకాశాలు బాగున్నప్పటికీ బొమ్మ తయారీకి అవసరమైన తెల్ల పొణికి లభ్యత సమస్యగా ఉందన్నారు. ఈ నేపథ్యంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం అనుసంధానంతో తెల్ల పొణికి (మిగతా 2లో)


కొండపల్లి బొమ్మల తయారీని పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

షరతుల్లేకుండా ధాన్యం కొనాలి

● ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు డిమాండ్
● పౌర సరఫరాల శాఖ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఎలాంటి షరతులు లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోలులో జాప్యం లేకుండా చూడాలని, 48 గంటల్లో రైతుల ఖాతాలలో నగదు జమ చేయాలని, 1262 రకం ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా కొనాలని డిమాండ్ చేస్తూ విజయవాడ సమీపంలోని కానూరులో గల పౌర సరఫరా శాఖ కార్యాలయంలో కౌలు రైతు సంఘం ఆధ్వర్యాన జరిగిన ధర్నాలో హరిబాబు మాట్లాడారు. ఆరుగాలం కష్టించి రూ.5 నుండి రూ.10 వరకు వడ్డీలతో అప్పులు చేసి, పంటలు పండిస్తే ధాన్యం కొనేదిక్కు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన 1216 రకం రైతులు పంట పండిస్తే ఈ క్రాప్ కూడా నమోదు చేశారని, అయితే తీరా పంట చేతికి వచ్చే సమయంలో ఈరకం కొనబోమని ప్రభుత్వం చెప్పడం సరికాదన్నారు. ఎలాంటి రకం ధాన్యమైనా, ఎంత తేమ శాతం ఉన్నా కొని, రైతులను ఆదుకుంటామని మంత్రులు, అధికారులు అనేక వాగ్దానాలు చేస్తున్నారని, కానీ ఆచరణలో ఏ ఒక్కటి అమలు జరగడంలేదని విమర్శించారు. ఏపీ కౌలు రైతు సంఘం కష్ణా జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లో రైతుల ఖాతాల్లో (మిగతా 2లో)


పౌర సరఫరాల కార్యాలయం వద్ద ధర్నాలో కౌలు రైతు, రైతు సంఘాల నేతలు హరిబాబు, రంగారావు, లక్ష్మణస్వామి, ఆంజనేయులు, కళ్యాణ్ తదితరులు



'అమ్మ' అధ్యక్ష కార్యదర్శులుగా సతీష్ బాబు, సుంకర చంద్రశేఖర్


గారపాటి సతీష్ బాబు


సుంకర చంద్రశేఖర్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఆంధ్రా మోటార్ మర్చంట్స్ అసోసియేషన్ (అమ్మ) సర్వసభ్య సమావేశం బుధవారం 'అమ్మ' హాలులో జరిగింది. ఈసమావేశంలో వార్షిక నివేదికతోపాటు 2024-2026 సంవత్సరానికి నూతన కార్యవర్గ కమిటీని నియమించారు. 'అమ్మ' అధ్యక్షులుగా గారపాటి సతీష్ బాబు, ఉపాధ్యక్షులుగా గోనుగుంట వెంకట సుబ్బారావు, దోనేపూడి దుర్గాప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా సుంకర చంద్రశేఖర్, సంయుక్త కార్యదర్శిగా కొమ్మినేని దుర్గా మల్లికార్జునరావు, కోశాధికారిగా అన్నే శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హర్ మొహిందర్ సింగ్ సాహ్ని హాజరై నూతన కార్యవర్గాన్ని అభినందించారు. అమ్మ సంస్థ నిరంతరాయంగా చేస్తోన్న సామాజికసేవ ప్రశంసనీయమని ఆయన కొనియాడారు.

మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : సిపిఎస్ ఉద్యోగుల మహాసభకు గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సంపూర్ణమద్దతు తెలుపుతున్నట్లు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి.జాని పాషా తెలిపారు. మానవహక్కుల దినోత్సమైన డిసెంబర్ 10న ఆంధ్రప్రదేశ్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడలో పాత పెన్షన్ సాధన కోసం నిర్వహించనున్న మహాసభకు తెలుపుతున్నట్లు చెప్పారు. ఎపి రాష్ట్ర సిపిఎస్ ఉద్యోగుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.యం.దాస్, ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ ఆహ్వానం మేరకు, గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులను మహాసభకు ఆహ్వానిస్తూ ఎం.డి.జాని పాషా ఆధ్వర్యంలో సచివాలయ ఉద్యోగుల తరపున విజయవాడలో మహాసభ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు ఎం. శశిధర్, యంన్.కె.సుభాని, జి.నవీన్ కుమార్, సి.హెచ్. రామకష్ణ కోటా రంజిత్ తదితరులు పాల్గొన్నారు.



బాలికలు, మహిళలపై హింసను నిర్మూలిద్దాం

అమరావతి బాలోత్సవం అవగాహనా సదస్సుల్లో వక్తలు



ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : యునెస్కో పిలుపు మేరకు అమరావతి బాలోత్సవం ఆధ్వర్యాన విజయవాడలో హైస్కూల్స్ బాలికలకు 'బాడ్ టచ్ గుడ్ టచ్', ఫోక్సో చట్టాన్ని, బాల్య వివాహ నిరోధక చట్టం, బాలికల హక్కులపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఇప్పటి వరకు 15 హైస్కూల్స్లో ఈ కార్యక్రమాలు జరిగాయి. యునెసెప్ లెక్కల ప్రకారం బాలికలపై ప్రపంచవ్యాప్తితంగా 53 శాతం లైంగిక దాడులు జరుగుతున్నాయి. 90 శాతం కుటుంబ సంబంధీకులు, ఇరుగుపొరుగు వారు ఈ దాడులకు పాల్పడుతున్నారని అమరావతి బాలోత్సవం రిసోర్స్ పర్సన్ బండి స్వాతి పేర్కొన్నారు. ఆడ పిల్లల అక్రమ అమ్మకాలు పెరిగాయని, మత్తు పదార్థాలు, డ్రగ్స్, అశ్లీల చిత్రాలు, సోషల్ మీడియాలో వస్తున్న అసభ్య దశ్యాలు (ఫోర్నోగ్రఫి) బాలబాలికలపై ప్రభావం చూపుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పసి మనసులను కలుషితం చేస్తున్నాయని, స్కూల్స్, కాలేజీలు వద్ద డ్రగ్స్ అమ్మే ముఠాలు కేంద్రీకరిస్తున్నాయని పేర్కొన్నారు. దీని వలన ఆడ పిల్లలకు భద్రత కరువవుతోందని, ప్రాథమిక స్థాయిలోను, చదువు ఆపుచేసి 18 సంవత్సరాలు నిండక ముందే బాల్య వివాహాలు జరుగుతున్న ఘటనలు లెక్కకు మించి జరుగుతున్నాయని స్వాతి పేర్కొన్నారు. ప్రభుత్వాలు స్కూల్స్లో సెల్ఫ్ డిఫెన్స్ కోర్సులు కరాటే, కుంపు మొదలైన శిక్షణ ఇవ్వాలని, కుటుంబ వ్యవస్థలోని పిల్లలకు నైతిక విలువలు నేర్పాలని, ఆడపిల్ల. మగ పిల్లల్ని సమానంగా అన్ని పనుల్లో భాగస్వామ్యం చేయాలని రాజ్యాంగ కల్పించిన సమాన హక్కులును, విద్యా, ఉద్యోగాలను, ఆస్తి హక్కులను ఆచరణలో అమలు జరపాలని కోరారు. ఈ సదస్సుల్లో అమరావతి బాలోత్సవం రిసోర్స్ పర్సన్స్ బండి స్వాతి, కె. స్వరూపరాణి, రత్నాంబిక, తుమ్మల దుర్గాభవాని, చెన్ను ప్రసన్న, ఒ.పావని, పి. ఐజాక్ న్యూటన్ పాల్గొన్నారు. ఎ.కె.టి.కె. హైస్కూలు బయోలజీ టీచర్ డాక్టర్ శ్రీనివాసరావు, అమరావతి బాలోత్సవం ప్రధాన కార్యదర్శి ఆర్. కొండలరావు పాల్గొన్నారు.

యూనిఫాంపై ఆటో డ్రైవర్లకు హెచ్చరికలు

ప్రజాశక్తి - విజయవాడ : నగరంలో ట్రాఫిక్ నియమాల అమలను మరింత కట్టుదిట్టం చేయడంలో భాగంగా, ఆటో డ్రైవర్లు యూనిఫాం ధరించడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ నేపథ్యంలో ఎన్‌టిఆర్ జిల్లా పోలీసు కమిషనర్ యస్.వి. రాజశేఖర్ బాబు ఆదేశాల మేరకు యూనిఫాంలు ధరించని ఆటో డ్రైవర్లకు హెచ్చరికలు జారీచేస్తున్నారు. మొదటిసారి నిబంధనల ఉల్లంఘనకు సామాజిక అవగాహనతో హెచ్చరికలు ఇస్తారు. పునరావతమైతే జరిమానాలు విధించి రవాణా అధికారులకు నివేదిస్తారు.

బైక్ దొంగల అరెస్టు

ప్రజాశక్తి - విజయవాడ : బైకల దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుండి రూ.3.5 లక్షల విలువైన ఆరు మోటార్ సైకిళ్లు, ఐ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. భవానీపురం పోలీస్ స్టేషన్ సిబ్బంది సహకారంతో బుధవారం కబేళా సెంటర్లో వెహికల్ చెకింగ్ చేస్తుండగా ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. కృష్ణాజిల్లా పెనమలూరు మండలం కానూరుకు చెందిన డోలవన్ సాయి తేజ అలియాస్ బబ్లు, వంగ కిషోర్‌ను అరెస్టు చేశారు. వారి నుండి ఆరు బైక్‌లను, సెప్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. భవానీపురం సిఐ కే.ఉమామహేశ్వర రావు తమ సిబ్బందితో కలిసి నిందితులను పట్టుకున్నారు.

నగరంలో విసతంగా వాహన తనిఖీలు

ప్రజాశక్తి - విజయవాడ : ఎన్‌టిఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలో ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులు విజిబుల్ పోలీసింగ్, వాహన తనిఖీ నిర్వహించారు. 45 బందాలుగా ఏర్పడి విజయవాడలోని వివిధ ప్రదేశాలలో విస్తతంగా తనిఖీ నిర్వహించారు. మొత్తం 2845 వాహనాలను తనిఖీ చేయగా వాటిల్లో సరైన రికార్డులు, నెంబర్ పెట్లు లేని 525 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. హెల్మెట్, సీటు బెల్టు పెట్టని, ట్రిపుల్ రైడింగ్, రాష్ డ్రైవింగ్ చేసేవారిని, రిపీటెడ్ చలానాలు గల వాహనాలను గుర్తించి రూ.11,800 జరిమానాగా వసూలు చేశారు. సీజ్ చేసిన వాహనాల ఇంజన్, చాయిస్ నెంబర్లను తనిఖీ చేసిన అనంతరం సరైన రికార్డులు లేని వాహనాలకు జరిమానా విధించారు.



ఆర్చరీ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : మాచవరం శాతవాహ కాలేజీ గ్రౌండ్స్‌లో బుధవారం 20వ రాష్ట్రస్థాయి కాంపౌండ్ ఆర్చరీ పోటీలను సిపిఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆర్చరీ క్రీడను ఉనికిలోకి తీసుకువచ్చి వందలాది పథకాలను దేశానికీ, రాష్ట్రానికి అందించిన గురువు చెరుకూరి సత్యనారాయణకి ద్రోణాచార్య అవార్డ్ ఇచ్చి గౌరవించాలని కోరారు. చెరుకూరి సత్యనారాయణ మాట్లాడుతూ ఈ పోటీల్లో విజయం సాధించినవారు 15 నుండి 20వ తేదీ వరకు జంషెడ్ పూర్‌లో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. జాతీయ పోటీలలో టాప్ 8 సాధించిన టీములను ఫిబ్రవరిలో ఉత్తరాఖండ్లో జరిగే నేషనల్ గేమ్స్‌లో పాల్గొంటారని తెలిపారు.

సీనియర్ సివిల్ జడ్జి నందిగామ వారి కోర్టు
IA. 206/23 H.M.O.P.166/2022

Between:-
దొంతి స్రవంతి ... పిటిషనర్/రెస్పాండెంట్స్
మరియు
దొంతి అప్పలాచారి .... రెస్పాండెంట్/పిటిషనర్
తండ్రి కృష్ణమాచారి, మక్కపేట, వత్సవాయి మండలం

పై నంబరు గల కేసులో పిటిషనర్, రెస్పాండెంట్‌కు పై కోర్టువారు ది. 14.3.2023న డిక్రీ యిప్పించినారు. సదరు డిక్రీ ని నిలుపుదల చేయవలసినదిగా, పిటిషనర్, పై కోర్టు లో పిటిషన్ వేసి, రెస్పాండెంట్ కు నోటీసులు పంపిననుతీసుకోకుండా కాలయాపన చేయుచున్నారనియు, పై కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం సదరు పై నంబరు గల దావాలో రెస్పాండెంట్‌కు హాజరు నిమిత్తము ది. 13.12.2024 వాయిదా యున్నది. కావున పై రెస్పాండెంట్ ఉదయం గం. 10.30.ని.లకు పై కోర్టు వారి యెదుట కాగలరనియు లేని యెడల మీ పరోక్షంగా పై పిటిషన్ విచారించబడును.

ఇట్లు
మన్నెం నారాయణ రావు,
నందిగామ న్యాయవాది & నోటరీ,
ది. 4.12.2024. సెల్ నెం. **9490952102.**

IN THE COURT OF THE MVACT CUM XI ADDITIONAL CHIEF JUDGE CITY CIVIL COURT AT HYDERABAD
O.P.No.: 183 of 2024

Between:
Rachakonda Sai ...Petitioner
AND
APSRTC & others ...Respondents

To,
1.Naresh Mekala S/o Daveedu Aged Major, Occ: Driver R/o.16-8, Ashok Nagar, Tiruvuru, Krishna Dist-521230.

Please take notice that the above petitioner had filed the case for grant of compensation for the Injuries sustained by name Rachakonda Sai in a motor vehicle accident which occurred on 09-10-2023 under the limits of P.S. Tiruvuru.

The above case is posted to **27-12-2024** at **10-30** AM for your appearance and counter. If you fail to appear before this Hon'ble Court on specified date and time either In person or through an advocate, else the case will be decided exparte.

(BY ORDER OF THE COURT)
K.ANAND REDDY
D.VENKAT RAMANA
Counsels for the petitioner
Office: Flat No.212, Jamuna Towers, Opp: Yashoda Hospital, Malakpet, Hyderabad-500036.
Cell:9848052455, 9848051707

మొదటిపేజీ తరువాయి

షరతుల్లేకుండా ధాన్యం కొనాలి

నగదు జమ చేస్తామని చెప్పిన ప్రభుత్వం... రోజులు గడుస్తున్నా డబ్బులు జమకావడంలేదన్నారు. సాంకేతిక సమస్యలను సరిచేసి నగదు జమ చేయాలని డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు టీవీ లక్ష్మణస్వామి మాట్లాడుతూ కాటా కూలి, ట్రాన్స్‌పోర్ట్ ఛార్జీలను వెంటనే జమ చేయాలని, ట్రాన్స్‌పోర్టుకు లారీలు సకాలంలో పంపాలని, గోనే సంచులు తగినంత ఉంచాలని డిమాండ్ చేశారు. అనంతరం పౌర సరఫరాల శాఖ అధికారులకు సంఘం నేతలు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి పివి ఆంజనేయులు, వ్యవసయా కార్మిక సంఘం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్, కౌలు రైతు సంఘం కష్ణాజిల్లా అధ్యక్షులు కె.శివ నాగేంద్రం, నాయకులు వి మరియదాసు, జి రాజా, వై.జోజి, రైతు సంఘం నాయకులు వి.శివశంకర్, సిహెచ్ శ్రీహరి, పి దుర్గాప్రసాద్, కౌలు రైతులు జి నరేంద్ర, వి రాజేష్, పి ప్రసాద్, పి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

తెల్ల పొణికి కొరతపై ప్రత్యేక జాయింట్ కమిటీ

నర్సరీ అభివద్ధికి ప్రభుత్వం నుంచి ఆదేశాలు ఉన్నాయన్నారు. తెల్ల పొణికి లభ్యతను పెంచేలా ఫారెస్టు, డీఆర్‌డీఏ, డ్వామా తదితర శాఖల సమన్వయంతో కషి చేయనున్నట్లు తెలిపారు. సమస్య పరిష్కారానికి వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక జాయింట్ కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఒకవైపు అటవీ నిబంధనలను పాటిస్తూనే, మరోవైపు తెల్ల పొణికి కళాకారులకు అందుబాటులో ఉండేలా పటిష్ట ప్రణాళికతో చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు. కళను ప్రోత్సహించి, సంప్రదాయ కళా సంపదను భావితరాలకు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, డ్వామా పీడీ ఎ.రాము, డీఎఫ్‌వో జి.సతీష్, కొండపల్లి మునిసిపల్ కమిషనర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

6 నుండి 'కృష్ణవేణి సంగీత నీరాజనం'

విశ్రాంతి తీసుకునేలా సీటింగ్ ప్రాంతాలు, రెస్ట్ రూమ్‌లు, అడ్వెంచర్ టూరిజం స్పాట్‌గా గండికోట అభివృద్ధి పనులు జరుగుతాయని తెలిపారు. ఇప్పటికే కేంద్రానికి సమగ్ర నివేదిక (డీపీఆర్) పంపగా, సానుకూలత వ్యక్తమైందన్నారు. గోదావరి పుష్కరాల నాటికి అద్భుత పర్యాటక కేంద్రంగా రాజమహేంద్రవరంను తీర్చిదిద్దుతామని చెప్పారు. అఖండ గోదావరి ప్రాజెక్టులో భాగంగా రూ.99 కోట్లతో శతాబ్దం చరిత్ర కలిగి నిరుపయోగంగా ఉన్న హేవలాక్ బ్రిడ్జిని అద్భుతమైన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు. గ్లాస్ బ్రిడ్జి, బోట్ రైడింగ్, వాటర్ స్పోర్ట్స్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. బ్రిడ్జి లంకను అభివద్ధి చేస్తామన్నారు. గోదావరి పుష్కరాల నాటికి అద్భుత పర్యాటక కేంద్రంగా రాజమహేంద్రవరంను తీర్చిదిద్దుతామన్నారు. అదే విధంగా కడియం నర్సరీని అద్భుతంగా తీర్చిదిద్ది పర్యాటక కళ తెస్తామన్నారు. రాష్ట్రంలో టెంపుల్ టూరిజంతో పాటు ఎకో, వెల్ నెస్, హెరిటేజ్, అడ్వెంచర్ టూరిజంలను అభివద్ధి చేస్తామన్నారు.

మహారాజశ్రీ అదనపు సీనియర్ సివిల్ జడ్జి, కొత్తగూడెం వారి కోర్టులో
ఐ.ఏ.నెం.1 ఆఫ్ 2024 ఇన్ హెచ్.ఎమ్.ఓ.పి.నెం.84 ఆఫ్ 2024

Between:
పొదిలి వెంకటేశ్వరరావు ......వాది
మరియు
పొదిలి @ మద్దిశెట్టి లలిత ......ప్రతివాది
టు
పొదిలి @ మద్దిశెట్టి లలిత, భర్త : పొదిలి వెంకటేశ్వరరావు, తండ్రి : మద్దిశెట్టి శ్రీను (లేటు), వయస్సు : 26సం॥లు, వృత్తి : గృహిణి, నివాసం: కంభంపాడు గ్రామము, ఎ.కొండూరు మండలం, N.T.R. District.

పైన తెల్పిన వాది పై కోర్టులో మీపై విడాకుల కొరకు కేసు వేసియున్నారు. అట్టి కేసు తేది.31-12-2024 నాడు జడ్జి గారు మీ హాజరు కొరకు వేసియున్నారు. అట్టి కేసులో మీరు **తేది.31-12-2024 ఉ॥గం॥10:30ని॥**లకు మీరు స్వయంగాని లేక మీ తరుపు న్యాయవాది గారి ద్వారా కాని హాజరు కాగలరు. లేని యెడల మీ పరోక్షంలో పై కేసు విచారించడం జరుగుతుంది.

వాయిదా: 31-12-2024
//కోర్టు వారి అనుమతితో//

పసుపులేటి యాకయ్య
న్యాయవాది, ఇల్లందు,
04-12-2024. క్యాంపు కొత్తగూడెం.
కొత్తగూడెం. సెల్ : 9912166358

ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం కొనుగోళ్లు

మంత్రి కొల్లు రవీంద్ర



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర బుధవారం కలెక్టరేట్ మీకోసం మీటింగ్ హాలులో జిల్లా కలెక్టర్, అధికారులు, మిల్లర్లతో సమావేశం నిర్వహించి జిల్లాలో ధాన్యం సేకరణ, రైతుల సమస్యలపై సమీక్షించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ వాతావరణ మార్పుల వల్ల ధాన్యం సేకరణకు సంబంధించి రైతుల సమస్యలు ప్రభుత్వం దష్టికి వచ్చాయన్నారు జిల్లాలో ఈ ఏడాది ధాన్యం దిగుబడి అంచనా 9.79 లక్షల మెట్రిక్ టన్నులు కాగా దీనిలో స్థానిక వినియోగం పోను సుమారు 5.50 లక్షల ఎంటి ధాన్యం సేకరణకు యంత్రాంగాన్ని సిద్ధం చేసినట్లు తెలిపారు.ప్రతి ఏడాది నవంబర్ నెలలో 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరిగేదని, అయితే ఈ నవంబర్లో 1.53 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ జరిగిందని, కారణం మెషిన్ కటింగ్ వల్ల లోడింగ్, అన్ లోడింగ్, ఒకేసారి ధాన్యం రావడం మిల్లుల వద్ద రద్దీ ఏర్పడడం, తేమ శాతంలో గందరగోళ పరిస్థితులు వల్ల సమస్యలు ఏర్పడ్డాయని అన్నారు. దీనిపై మిల్లర్లతో ఈరోజు సమావేశం ఏర్పాటు చేసి వారికి సూచనలు ఇవ్వడం జరిగిందన్నారు.దీన్ని అధ్యయనం చేసి ఎంత స్టాక్ ఉన్నాయి, ఇంకా ఎంత పరిమాణం తీసుకోవచ్చు మిల్లర్లు లెక్కించుకుని రైతుల వద్ద నుండి ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని చెప్పినట్లు మంత్రి తెలిపారు.నిబంధనల మేరకు తేమశాతం 17 కాగా, దీనికి 5 శాతం ఎక్కువగా ఉన్న దాన్యం సేకరించాలని, రైతులకు మద్దతు ధరలు తగ్గించకూడదని మిల్లర్లకు సూచించినట్లు మంత్రి తెలిపారు. మరోవైపు దళారులపై చర్యలు తీసుకోవాలని చెప్పామన్నారు.గతంలో ధాన్యం విక్రయించిన రైతుకు చెల్లింపులు రెండు నెలల జాప్యం జరిగేదని, అయితే తమ ప్రభుత్వం 48 గంటల్లో రైతులకు చెల్లింపులు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు రైతులకు 280 కోట్ల రూపాయలు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు.ధాన్యం సేకరణ ప్రారంభమైనప్పటి నుంచి రాష్ట్ర పౌర సరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ జిల్లాలో ఇప్పటికే రెండుసార్లు పర్యటించారని, బుధవారం కూడా అవనిగడ్డ ప్రాంతంలో పర్యటించి రైతులు సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారాన్ని కషి చేస్తున్నరని తెలిపారు.తొలుత సమావేశంలో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ ధాన్యం సేకరణలో సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. డిఆర్ఓకె చంద్రశేఖరరావు మిల్లర్లు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



రెండో రోజుకు సఫాయి కార్మికుల నిరసన

ప్రజాశక్తి-గుడివాడ: గత 3 నెలల నుండి జీతాలు చెల్లించకుండా ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ శానిటేషన్ సఫాయి మహిళా కార్మికుల జీతాలు వెంటనే చెల్లించాలని గుడివాడ నియోజకవర్గ ఏఐటియుసి గౌరవ అధ్యక్షుడు గూడపాటి ప్రకాష్‌బాబు, కార్యదర్శి చింతలూరి సత్యనారాయణలు డిమాండ్ చేశారు. బుధవారం అన్నే నరసింహారావు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వద్ద ఏఐటియుసి అనుబంధ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యానియన్ శానిటేషన్ సఫాయి మహిళా కార్మికుల మూడు నెలల జీతాలు చెల్లించాలని కోరుతూ రెండో రోజు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటియుసి గుడివాడ నియోజకవర్గ గౌరవ అధ్యక్షుడు గూడపాటి ప్రకాష్‌బాబు, కార్యదర్శి చింతలూరి సత్యనారాయణలు మాట్లాడుతూ శానిటేషన్ కాంట్రాక్టర్ మూడు నెలల నుండి జీతాలు చెల్లించకుండా ఉద్యోగాలు చేయించడం దారుణమన్నారు. పిఎఫ్‌ల విషయంలో కూడ శానిటేషన్ సిబ్బందిని మోసం చేసిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం వెంటనే సఫాయి కార్మికులకు జీతాలు చెల్లించేల చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నిరసనలలో వడ్డాది రమణమ్మ, కనుమూరి విజలక్ష్మీ, వేల్పుల ధనలక్ష్మీ, మాతంగి మేరిమ్మ, దొండపాటి పద్మావతి, కోటేశ్వరమ్మ, థెరేజమ్మ, మణిమ్మ, తదితరులు పాల్గొన్నారు.



రోశయ్య నివాళి

ప్రజాశక్తి-అవనిగడ్డ: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య మూడో వర్ధంతిని అవనిగడ్డ మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. బుధవారం ఫైర్ స్టేషన్ వద్ద గల రోశయ్య, మహాత్మా గాంధీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలకు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పూలదండలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రోశయ్య గొప్ప పరిపాలన దక్షుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, మండల అధ్యక్షులు యాసం చిట్టిబాబు, ఆర్యవైశ్య సంఘం నాయకులు ఘంటసాల రాజమోహనరావు, వెంకటేశ్వరరావు, దేసు జగన్మోహన్రావు పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం

ప్రజాశక్తి-ఘంటసాల: ఘంటసాల గ్రామానికి చెందిన వేమూరి వెంకట్రామయ్య నరసమ్మ కుమారుడు రామారావు జ్ఞాపకార్థం సోదరి వేమూరి వెంకట రమణమ్మ ఘంటసాలలో వెంచేసి ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రాలు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం, జలదీశ్వర స్వామి దేవస్థానంలలో ఉత్సవాలకు యాత్రికులకు ప్రసాదాలు అందజేసే నిమిత్తం రెండు లక్షల రూపాయలు విరాళంగా ట్రష్టీలు గొర్రెపాటి వెంకట రామకృష్ణ, జగన్ మోహన్‌రావులకు గొర్రెపాటి గోపాలకృష్ణ బుధవారం అందజేశారు.

సిఎం సహాయ నిధి మంజూరు

ప్రజాశక్తి-గుడ్లవలేరు: మండలంలోని వెణుతురమిల్లి గ్రామానికి చెందిన కొప్పినేని నాగభవేశ్వరి ఏడు సంవత్సరాల చిన్నారికి రెండు చెవులు వినికిడి లోపంతో బాధపడుతుందని తెలుసుకున్న గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి 5,33,624 రూపాయలు మంజూరు చేయించారు. ఈ మేరకు బుధవారం చెక్కును అందజేశారు.

మంచిచెడులపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి-చల్లపల్లి: పిల్లలకు చదువుతో పాటుగా మంచి చెడులపై వాటి వల్ల కలిగే పరిణామాలపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు వివరించాలని చల్లపల్లి సిఐ ఈశ్వర్‌రావు సూచించారు. స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంలో భాగంగా చల్లపల్లి మండల పరిధి లక్ష్మీపురం శివారు రామానగరంలోని శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు సేఫ్ ఇండియా ర్యాలీని చల్లపల్లి ప్రధాన రహదారులపై బుధవారం నిర్వహించారు. ర్యాలీని సీఐ ఈశ్వరరావు జండా ఊపి ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండని పిల్లకు వాహనాలు ఇవ్వవద్దని తల్లిదండ్రులకు సూచించారు. ద్విచక్ర వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని అన్నారు. లైసెన్స్ లేకుండా వాహనాల నడపటం చట్టరీత్యా నేరమన్నారు. ప్రస్తుతం జరుగుతున్న సైబర్ క్రైమ్ గురించి, డిజిటల్ అరెస్టుల గురించి విద్యార్థులకు వివరంగా వివరించారు. నాసా కిట్స్



డిస్ట్రిబ్యూట్ చేసి ప్రతి సంవత్సరం ప్రాజెక్ట్ ప్రిపేర్ చేసి పంపించే విద్యార్థులకు ప్రాజెక్టులో విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ డి సురేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని సేఫ్ ఇండియా కార్యక్రమంపై తయారు చేసిన ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు.

సంక్షేమ పథకాలను వికలాంగులు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-గుడివాడ: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలను విభిన్న ప్రతిభావంతులు సద్వినియోగం చేసుకోవాలని కళింగ కార్పోరేషన్ డైరెక్టర్ మజ్జాడ నాగరాజు అన్నారు. బుధవారం స్థానిక కైకాల సత్యనారాయణ పురపాలక కళాభవనంలో మెప్మా ఆధ్వర్యంలో ప్రపంచ ప్రతిభావంతలు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న కళింగ కార్పోరేషన్ డైరెక్టర్ నాగరాజు మాట్లాడుతూ దివ్యాంగులు ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా సియంయం



బసవేశ్వరరావు, సిఓలు విజయకుమారి, బి.బిజాన్, షరిపోన్, వల్లి కృష్ణకుమారి, రవి, ఆర్‌పిలు, తదితరులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారం మానుకోవాలి : సింహాద్రి


మాట్లాడుతున్న సింహాద్రి రమేష్‌బాబు

ప్రజాశక్తి-అవనిగడ్డ: డాక్టర్ శ్రీహరిరావు హత్యపై తమపై అసత్యాలు ప్రచారం చేయడం మానుకోవాలని మాజీ ఎమ్మెల్యే వైసీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో సమస్యల గురించి అక్రమాల గురించి మాట్లాడుతుంటే తమపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో కూటమి నేతలు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని, వాళ్ల అధినేతల మాదిరిగానే నియోజకవర్గంలో ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ పాలిటిక్స్ పాల్పడుతున్నారని విమర్శించారు. గత నాలుగేళ్ల క్రితం అవనిగడ్డలో జరిగిన డాక్టర్ శ్రీహరి హత్య కేసు తనపై రుద్దే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. శ్రీహరిరావు తమకు మాజీ పార్టనర్ అని, ఆయనతో మంచి సంబంధాలు ఉండేవి అన్నారు. ఆయన హత్య కేసు తేల్చమని ఎప్పటినుంచో కోరుతున్నానని ఆయన హత్య జరిగినప్పుడు తన మీద ఎటువంటి ఆరోపణలు లేవని కానీ ఇప్పుడు మాత్రం ఆ హత్యను తనపై రుద్దే ప్రయత్నం చేస్తున్నారన్నారు. అందుకే శ్రీహరి హత్య కేసులో నిందితులను నిగ్గు తేల్చాలని తాను డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ రైతు విభాగం నాయకులు కడవకొల్లు నరసింహారావు, జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ, నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, యువజన విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గాజుల జయ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌సి వర్గీకరణపై సుప్రీం తీర్పు సరికాదు

జెఎసి చైర్మన్ దేవిప్రసాద్

ప్రజాశక్తి-అవనిగడ్డ: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పునివ్వడం రాజ్యాంగ విరుద్ధమని, ఇది ఎస్సీ వర్గాల మధ్య అనైక్యతను సృష్టించేదని విశ్రాంతి ఐఆర్ఎస్ అధికారి, అఖిలభారత మాల సంఘాల జేఏసీ చైర్మన్ ఉప్పులేటి దేవిప్రసాద్ అన్నారు. అవనిగడ్డలోని ఏవన్ మార్ట్ సమావేశం హాల్లో మాలల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు వల్ల 59 కులాలు నష్టపోతాయన్నారు. దీనితో పాటు క్రిమిలేయర్ విధానాన్ని కూడా అమలు చేయాలని చెప్పడం మాదిగలతో సహా ఎస్సీలందరికీ నష్టం జరుగుతుందన్నారు. 2004లో చంద్రబాబు నాయుడు అధికారంలో ఉండి వర్గీకరణ పేరుతో రిజర్వేషన్లు కల్పించడం ద్వారా ఓడిపోవడం జరిగిందని తిరిగి మరల ఇప్పుడు అదే విధానాన్ని కొనసాగించేందుకు ఆత్రుత పడుతున్నారని మెజార్టీ జనాభా కలిగిన మాలల చేతిలో మరోసారి పరాభవం తప్పదని గుర్తు చేశారు. గతంలో వివి చిన్నయ్య తీర్పు ప్రకారం వర్గీకరణ కుదరదని చెప్పితే ఇప్పుడు తిరిగి మరలా అదే సుప్రీంకోర్టు వర్గీకరణ చేసుకో వచ్చునని రాష్ట్రాలకు అవకాశాలు కల్పించడం సరైనది కాదన్నారు. ఈ నెల 15న వర్గీకరణకు వ్యతిరేకంగా గుంటూరులోని నల్లపాడు వద్ద జరిగే మాలల మహా గర్జనను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంతగాని రమేష్, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దోవ గోవర్ధన్, పుల్లగోరు రాజేంద్ర, జై భీమ్ భారత్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ సముద్రాల అంబేద్కర్, కర్ర సుధాకర్ పాల్గొన్నారు.



స్వల్ప భూ ప్రకంపనలు

పరుగులు పెట్టిన ప్రజలు

ప్రజాశక్తి - కంచికచర్ల : కంచికచర్ల మండలంలో బుధవారం ఉదయం 7.30 గంటల సమయంలో భూమి కంపించింది. సెకను పాటు భూమి కదిలినట్లు పలువురు చెబుతున్నారు. ఉదయాన్నే ఇంటివద్ద కుర్చీలో కూర్చున్నప్పుడు ఒక్కసారిగా భూమి కదిలి, కుర్చీ కూడా కదిలినట్లు అనిపించిందని గొట్టుముక్కల వాసులు పేర్కొన్నారు. ఇళ్లల్లో వంట గదుల్లో పనులు చేసుకుంటున్న సమయంలో ఇంట్లో సామాను కొద్దిగా కదిలినట్లు శబ్దం వచ్చినట్లు కంచికచర్లకు చెందిన కుమారి అనే మహిళ పేర్కొన్నారు. భూప్రకంపనలు తీవ్రత చాలా తక్కువగా ఉండటంతో ఎలాంటి నష్టం జరగలేదు. రెండు తెలుగు రాష్ట్రాల్లో భూకంపం సంభవించింది. ఇల్లల్లో ఉన్న వస్తువులు సెకన్ పాటు కంపించిందని ప్రజలు అంటున్నారు. తెలంగాణాలో విచ్చలవిడిగా బొగ్గు నిక్షేపాలు తవ్వకాలు జరిగటంవల్ల భూమి కంపించినట్లు పలువురు అంటున్నారు. రెండు తెలుగు రష్ట్రాల్లో నదీ తీర ప్రాంతంలో విచ్చల విడిగా ఇసుక తవ్వకాలు, బ్లాస్టింగ్‌తో కొండలను పిండి చేయటం వల్ల భూమిలో పొరలు ఏర్పడి, భూమి పొరలు సర్దుకునే క్రమంలో ఈ ప్రకంపనలు వస్తాయని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. **తిరువూరు :** భూకంపం తిరువూరు పట్టణంలోనే కాకుండా మండలంలోని వివిధ గ్రామాల్లో కూడా భూకం పం రావటంతో ప్రజలు భయభ్రాంతులకు గుర య్యారు. బుధవారం ఉదయం 7.40 గంటల సమయంలో అందరూ ఇంట్లో పనులు చేసుకుంటుండగా సామాన్లు కింద పడిపోవటం, ఇంటి కప్పు రేకులయితే దడదడ మంటూ శబ్దం రావటం, కొన్ని ఇళ్ల గోడలు పగుళ్ల వంటి సంఘటనలు మూడు సెకండ్లలో జరిగిపోయాయి. మొదట ఇలా జరగటం ఏమిటని కొంతమంది తెలిసి వారికి ఫోన్ చేసి తెలుసుకునేలోపులో భూకం పం అని సోషల్ మీడియా ద్వారా వ్యాప్తి చెందటంతో ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. తిరువూరు శాంతినగర్, సుందరయ్య కాలనీ, రాజుపేట, సిపిఎం ఆఫీస్ ఏరియాలో, బోసుబొమ్మ సెంటర్, తోళ్ళ బజారు, పాత తిరు వూరు, టేకులపల్లి, గానుగపాడు తదితర గ్రామాల్లో స్వల్ప భూకంపం సంభవించింది. **జగ్గయ్యపేట :** జగ్గయ్యపేట నియోజకవర్గం పరిధిలో కొన్ని ప్రాంతాల్లో కొన్ని సెకన్స్ మధ్య భూ ప్రకంపనలు వచ్చాయి. బుధవారం ఉదయం 7 గంటల 28 నిమిషాల నుండి 31 నిమిషాల మధ్యకాలంలో జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలో పలుచోట్ల భూమి 3 నుండి 5 సెకన్ల పాటు వివిధ ప్రాంతాల్లో కొన్ని సెకన్లు భూమి కపించిందని విషయం తెలియడంతో ప్రజలు భయాందోళన చెందారు.

టిప్పర్ ఢీకొని యువకుడు మృతి



ప్రజాశక్తి - వన్‌టౌన్ : టిప్పర్ ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందిన సంఘటనపై టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు విజయవాడ రూరల్ మండలం జక్కంపూడి పంచాయితీ వైఎస్‌ఆర్ కాలనీ, బ్లాక్ 42, ఎస్.ఎఫ్-2లో తుమ్మపాల అమ్మాజీ కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటుంది. భర్త తుమ్మపాల ప్రకాష్ 2015లోనే చనిపోయాడు. వీరికి ఇద్దరు కుమారులు. పెద్దబ్బాయి తుమ్మపాల హేమంత్ చరణ్ (27) విశ్వబ్రాహ్మణ్ డిప్లమో పూర్తిచేసి మూడు నెలలుగా పైపుల రోడ్డులో ఉన్న ఓ రెస్టారెంట్‌లో పనికి వెళ్తున్నాడు. బుధవారం ఉదయం వైఎస్ఆర్ కాలనీ నుండి పాముల కాలువ మీదుగా అంబాపురం ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. వైవి రావు రింగ్ వైపు నుండి అంబాపురం వైపుకు వెళ్తున్న టిప్పర్ లారీ వెనుక నుంచి చరణ్‌ను ఢీకొట్టగా అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న స్నేహితుడు అనిల్ మృతుని తల్లికి సమాచారం అందించగా కుటుంబీకులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానికులు సమాచారం మేరకు ఘటనా స్థలానికి వచ్చిన 108 సిబ్బంది అప్పటికే చరణ్ మృతిచెందినట్లు తెలిపారు. టిప్పర్ డ్రైవర్ లారీని అక్కడే వదిలి పారిపోయాడు. మృతుని తల్లి అమ్మాజీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

దుర్గమ్మను దర్శించుకున్న ఆనందసాయి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ఇంద్రకీలాద్రి దుర్గమ్మను ఆర్ట్ డైరెక్టర్, తిరుమల తిరుపతి దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ మెంబర్ ఆనంద సాయి బుధవారం అమ్మవారి ఆలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆలయ డిప్యూటీ ఇఒ రత్నరాజు దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వేదపండితులు వేద ఆశీర్వచనం చేశారు. డిప్యూటీ ఇఒ అమ్మవారి చిత్రపటం అందజేశారు.

7న మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి ఈ నెల 7న పాఠశాలలో మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ (సమావేశం)ను పెద్ద ఎత్తున జరపాలని నిర్ణయించినట్లు అజిత్‌సింగ్ నగర్‌లోని ఎమ్.కె.బేగ్ మున్సిపల్ స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఛైర్మన్ టి.సుధారాణి, కన్వీనర్ ఎమ్.ఎస్.ఇమామ్ బాషా తెలిపారు. బుధవారం ఉదయం స్కూల్లో హెచ్.ఎమ్.ఎమ్.ఎస్.ఇమామ్ బాషా అధ్యక్షతన జరిగిన సమావేశంలో కమిటీ సభ్యులు పాల్గొని వివిధ కమిటీలు ఏర్పాటు చేసుకుని సమన్వయంతో పనిచేయాలని, ప్రజా ప్రతినిధులను, స్వచ్ఛంద సంస్థలవారిని కోరారు. గత విద్యార్థులను, వారి తల్లిదండ్రులందరినీ ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రుల, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో పాఠశాలలను అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

ఆకుల శ్రీనివాస్‌కు పరామర్శ



శ్రీనివాస్‌తో మాజీమంత్రి పెద్దిరెడ్డి తదితరులు

ప్రజాశక్తి - భవానీపురం : పుత్ర శోకంతో బాధ పడుతున్న సీనియర్ రాజకీయ నాయకులు ఆకుల శ్రీనివాస్ కుమార్‌ను రాష్ట్ర మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి పరామర్శించి ఓదార్చారు. బుధవారం భవానీపురంలోని ఆకుల శ్రీనివాస్ స్వగృహానికి వచ్చిన పెద్దిరెడ్డి తొలుత స్వర్గీయ డాక్టర్ ఆకుల రాజకుమార్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఆకుల శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు తమ సానుభూతిని తెలిపారు. ఆకుల శ్రీనివాస్‌ను మాజీ ఎంఎల్ఎ సామినేని ఉదయభాను, మాజీ మేయర్ తాడి శకుంతల, కార్పొరేటర్లు యరడ్ల ఆంజనేయ రెడ్డి, ఎమ్‌డి ఇర్ఫాన్, కాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్ అడపా శేషు, మాజీ కార్పొరేటర్ అబ్దుల్ ఖాదర్, వైసిపి నాయకులు పొదిలి చంటి బాబు, అల్లం పూర్ణ, మేళం చిన్న తదితరులు పరామర్శించారు.

ఆర్థిక సాయం

ప్రజాశక్తి - భవానీపురం : స్థానిక 46వ డివిజన్ మార్కుపేటలో గుండెపోటుతో మరణించిన వంగూరి జార్జ్ (75) కుటుంబానికి పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు యలమంచిలి సత్యనారాయణ (సుజన చౌదరి) ఆదేశాలతో ఆర్థిక సాయం అందించారు. ఎంఎల్ఎ కార్యాలయ సిబ్బంది, కూటమి నాయకులతో కలిసి బుధవారం వారి కుటుంబాన్ని పరామర్శించారు. నిరుపేద అయిన వంగూరి జార్జ్ కుటుంబానికి మట్టి ఖర్చుల నిమిత్తం సాయం అందజేయాలని 46వ డివిజన్ టిడిపి అధ్యక్షులు ధీటి ప్రభుదాస్, గుర్రంకొండ సుజనా దృష్టికి తీసుకెళ్లగా తక్షణమే సాయం అందజేయాలని ఆదేశాలు జారీ చేశారు.

మరమ్మతులు ప్రారంభం



ప్రజాశక్తి- నందిగామ : గుంతల రహిత రోడ్లే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన మిషన్ పాట్ హోల్‌ఫ్రీ (గుంతల రహిత ఆంధ్రప్రదేశ్) కార్యక్రమం ఎపి ప్రభుత్వ విప్ ఎంఎల్ఎ తంగిరాల సౌమ్య బుధవారం ప్రారంభించారు. నందిగామ - చందర్లపాడు రహదారికి రూ.65 లక్షలతో చేపట్టిన మరమ్మతు పనులను స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మిషన్ మోడ్‌లో రాష్ట్రంలో రహదారుల మరమ్మతులు చేపడతామని తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలో రహదారుల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు. రోడ్ల మరమ్మతుల విషయంలో ఎలాంటి అలసత్వం లేకుండా చర్యలు చేపట్టినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ ధర్నా

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: మండలం లోని చిల్లకల్లు గ్రామంలో కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ 220 కెవి, 33/11 కెవి సబ్ స్టేషన్లు వద్ద వైసిపి ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇప్పుడున్న అధికార పార్టీ తాము అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచమని ఎన్నికల ముందు ప్రజలకు తప్పుడు వాగ్దానాలు ఇచ్చి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం నేడు ట్రూ ఆఫ్ ఛార్జీల పేరుతో సామాన్యమైన పేద ప్రజల్ని నడ్డి విరుస్తుందన్నారు. పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించని పక్షంలో ఎంతటి పోరాటానికైనా వైసిపి సిద్ధమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా మహిళా అధ్యక్షురాలు సంపత్ విజిత, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా వైకుంఠరావు, వైసిపి జిల్లా కార్యదర్శులు మాతంగి నాగబాబు, వేముల మల్లేశ్వరావు, మండల పార్టీ అధ్యక్షులు బూడిద నరసింహరావు, ఎస్టీ సెల్ అధ్యక్షులు లాహోరి బద్దు నాయక్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఫిరోజ్ ఖాన్, కనకదుర్గమ్మ వస్థానం డైరెక్టర్ నంబూరి రవి పాల్గొన్నారు.



గ్రంథాలయానికి వాటర్ ప్యూరిఫయర్ బహూకరణ

విజయవాడ : ప్రతినిత్యం వందలాది మంది పాటకులతో కళకళలాడుతున్న మహాత్మా గాంధీ రోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయానికి ఎందరో దాతలు తమ వంతు సహకారాన్ని ప్రోత్సాహాన్ని అందజేస్తున్నారు. వారికి గ్రంథాలయ పాఠశాల తరపున ధన్యవాదాలు అని గ్రంథాలయాధికారి కె.రమాదేవి తెలిపారు. బుధవారం రిటైర్డ్ లెక్చరర్ విఎల్‌ఎన్.రావు, శిఖామణి సెంటర్ వారు అందజేసిన రూ.15వేల విలువైన విలువైన వాటర్ ప్యూరిఫైయర్‌ను గ్రంథాలయాధికారి ప్రారంభించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ పాఠకుల, సందర్శకుల ఆరోగ్య పరిరక్షణకు పరిశుభ్రమైన స్వచ్ఛమైన నీటిని అందించేందుకు ఇది ఎంతగానో తోడ్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది కె.రాంబాబు, వై.ధనలక్ష్మి, పాటకులు పాల్గొన్నారు.



ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్ మొబైల్ యాప్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్, దాని సలహాదారుల కోసం ప్రత్యేకంగా మొబైల్ యాప్ ప్రారంభించినట్లు సంస్థ ప్రతినిధి ఎం.ప్రతాప్ తెలిపారు. నగరంలోని సంస్థ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు తెలిపారు. యాప్ ద్వారా అవగాహన కల్పించేందుకు ఉపయోగపడుతుందని అన్నారు. ఐప్రు ఎడ్జ్ వారి ఉత్పాదకతలో 37 శాతం పెరుగుదలకు దారితీసిందని ఫలితంగా వారికి అధిక ఆదాయమూ వచ్చిందని తెలిపారు. ముఖ్యంగా, ఐప్రు ఎడ్జ్ని ఉపయోగించే 98.1శాతం ఏజెంట్లకు అదే రోజు కమీషన్లు చెల్లించేందుకు, ఎంపిక చేయబడిన డిస్ట్రిబ్యూటర్లకు అదే రోజున కమీషన్లను చెల్లించే మొదటి జీవిత బీమా సంస్థ, ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్ అన్నారు. కంపెనీ 2 లక్షలకు పైగా సలహాదారుల నెట్ వర్క్ కలిగి ఉందన్నారు. కంపెనీ అగ్ర సలహాదారుల్లో దాదాపు 61 శాతం మంది ఇప్పుడు తమ వ్యాపారాన్ని వృద్ధి చేసుకోవడంలో సహాయపడే యాప్‌ను చురుకుగా ఉపయోగిస్తున్నారని తెలిపారు.

నందిగామలో శాశ్వత సబ్ ట్రెజరీ భవనం నిర్మించాలి

ప్రజాశక్తి - నందిగామ : నందిగామలో శాశ్వత సబ్ ట్రెజరీ భవనం నిర్మించాలని నందిగామ రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్యకు వినతిపత్రం అందజేశారు. నందిగామ ఉప ఖజానా కార్యాలయానికి సొంత భవనాలు లేకపోవటం వల్ల అనేకమంది ఉద్యోగస్తులు పింఛనుదారులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. తాత్కాలికంగా సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో ఉప ఖజానా కార్యాలయం నిర్వహిస్తున్నప్పటికీ వారి అవసరాల నిమిత్తం ఖాళీ చేయాలని పదే పదే కోరుతున్నారని తెలిపారు. స్థానిక ఆర్‌డిఒ కార్యాలయ ప్రాంగణంలో 5 సెంట్ల ఖాళీ స్థలం కేటాయించారని, కార్యాలయ నిర్మాణానికి అనుమతులివ్వాలని కోరారు. నందిగామ రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు గుప్తా, కార్యదర్శి వాసిరెడ్డి గోపాల కృష్ణ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వంతో బీమా సౌకర్యం

ప్రజాశక్తి - మైలవరం : మైలవరంలో ఇప్పటివరకు 3 వేల మంది టిడిపి సభ్యత్వాన్ని తీసుకున్నట్లు నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు లంక లితీష్ పేర్కొన్నారు. స్థానిక ఎంఎల్ఎ వసంత కృష్ణ ప్రసాద్ ఆదేశాల మేరకు బుధవారం మైలవరంలో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి సభ్యత్వం పొందిన వారికి రూ.5 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. ప్రతి ఒక్కరిని టిడిపి సభ్యులుగా చేర్పించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జి.రమణ , స్థానిక నాయకులు పాల్గొన్నారు.



రైస్‌మిల్‌ను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ కొలికపూడి

రైస్‌మిల్ ప్రారంభం

ప్రజాశక్తి - విస్సన్నపేట : విసన్నపేట మండలం కొండపర్వ గ్రామంలో శ్రీ కోట మహాలక్ష్మి రైస్ ఇండస్ట్రీస్‌ని ఎంఎల్ఎ కొలికపూడి శ్రీనివాసరావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడున్న మిషనరీస్‌ని, వాటి పని విధానాన్ని పరిశీలించి యాజమాన్యాన్ని అడిగి తెలుసుకొని మంచి అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పులిపాటి శ్రీనివాసరావు, ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు చిన్ని రామ సత్యనారాయణ ఏలూరు అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు దివ్వెల జయప్రకాష్, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షులు కోన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులకు అవగాహన

ప్రజాశక్తి - విస్సన్నపేట : అంబేద్కర్ కూడలిలో ఎస్ఐ జి.రామకృష్ణ వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెంబర్ ప్లేట్లు, లైసెన్సులు, హెల్మెట్, త్రిబుల్ రైడింగ్‌కు సంబంధించి మొత్తం 20 ద్విచక్ర వాహనాలకు జరిమానా విధించారు. సరైన పత్రాలు లేని బండ్లకు జరిమానా విధించారు.


శిథిలమైన భవనం

శిథిలావస్థలో వసతి గృహం

- వర్షానికి తడిసి పాడైపోయిన బియ్యం • సమస్యలతో విద్యార్థులకు ఇబ్బందులు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: కౌతవరం సాంఘిక సంక్షేమ హాస్టల్లో నెలకొన్న సమస్యలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. భవనం శిథిలావస్థకు చేరడంతో విద్యార్థుల భోజనం కోసం నిల్వ ఉంచిన బియ్యం బస్తాలు వర్షానికి తడిచి బూజుపట్టి పాడైపోయాయి. హాస్టల్ వార్డెన్ శ్రీనివాసరావు గత కొద్ది రోజులుగా విధులకు గైర్హాజర్ కావడంతో గుడివాడ ఏఎస్‌డబ్ల్యూ వెంకటకృష్ణారావుకు మంగళవారం నుంచి ఇంచార్జి బాధ్యతలు అప్పగించారు. నందివాడ, గుడివాడ, ఉయ్యూరు, కలిదిండి, మండవల్లి మండలాల్లోని వివిధ గ్రామాల నుండి విద్యార్థులు ఈ సాంఘిక సంక్షేమ హాస్టల్లో వుండి కానూరి దామోదరయ్య జిల్లా పరిషత్ హై స్కూల్లో విద్యాభ్యాసం చేస్తున్నారు. అయితే సరైన వసతులు లేకపోవడంతో 20 మంది విద్యార్థులకు 12 మంది మాత్రమే ఉంటున్నారు. గతంలో ప్రతి మండలానికి రెండు మూడు వసతి గృహాలు ఉండేవి. అయితే రానురాను ప్రైవేట్ పాఠశాలలు, రహదారి, వాహనాలు పెరగడంతో నియోజకవర్గానికి ఒకటి, రెండు వసతి గృహాలు మాత్రమే ప్రభుత్వం నిర్వహిస్తుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వసతి గృహంలో సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు.


పాడైపోయిన బియ్యం

బూజు పట్టిన బియ్యం

హాస్టల్ స్టోర్ రూమ్ తెరిస్తే చాలు పిల్లలు తినే బియ్యం తడిసి, బూజు పట్టి దర్శనమిస్తున్నాయి. హాస్టల్ స్లాబు నుంచి వర్షప నీరు కారిపోవటంతో బియ్యం పాడైపోయాయని సిబ్బంది చెబుతున్నారు. హాస్టల్ మరమ్మతులకు లక్షలాది నిధులున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ పాడుబడిన భవనంలోనే పేద విద్యార్థులు దయనీయ పరిస్థితుల్లో ఉంటున్నారు. మొక్కలు మొలిచి స్లాబు పెచ్చులు ఊడిపడుతున్నాయి. దాతలు ఇచ్చిన ఆర్వో వాటర్ సిస్టమ్‌ను కూడా పాడైపోతే పక్కకు నెట్టేశారు. వాష్‌రూమ్స్ ఉన్నా లేనట్లే. హాస్టల్లో ఫ్లోరింగ్ పగిలిపోయి అస్తవ్యస్తంగా మారింది. తడిసిపోయి బూజు పట్టిన బియ్యం స్థానంలో వేరే బియ్యాన్ని దిగుమతి చేస్తామని ఏఎస్ డబ్ల్యూఓ వెంకట కృష్ణారావు చెబుతున్నారు. ప్రభుత్వం రూ.11 లక్షల నిధుల్ని మరమ్మతులకు ఇచ్చిన మాట వాస్తవమేనన్నారు.



జాతీయ రహదారి శుభ్రం

ప్రజాశక్తి-చల్లపల్లి: జాతీయ రహదారిపై చల్లపల్లి స్వచ్ఛ సుందర కార్యకర్తల సేవలు. స్వచ్ఛ సుందర చల్లపల్లి సేవలు బుధవారం నాటికి 3312 రోజుకు చేరుకున్నాయి. వేకువ జామున చల్లపల్లి స్వచ్ఛ సుందర కార్యకర్తలు 216 జాతీయ రహదారిని శుభ్రం చేసి, రహదారి కిరువైపులా ఉన్న పిచ్చి మొక్కలు తొలగించారు రహదారిపై మిగిలిన ధాన్యపు గింజలు, గడ్డిని తొలగించారు.ముఖ్యంగా రహదారిపై అంగుళం ఎత్తు పేరుకుపోయిన పేరుకుపోయిన మట్టిని పరిశుభ్రం చేశారు. తొలగించిన పిచ్చి మొక్కలు, వ్యర్థాలను ట్రాక్టర్ పై డంపింగ్ యార్డ్ కు తరలించారు. కాసా నగర్ కూడలి వద్ద సుంద్రీకరణ పనులను పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ చల్లపల్లి సుందర కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): కృష్ణాజిల్లాలో ఈ నెల 6వ తేదీ నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ రెవిన్యూ ముఖ్యకార్యదర్శి ఆర్పి సిసోడియ, భూ పరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) జయలక్ష్మి తదితరులతో కలిసి బుధవారం అమరావతి సచివాలయం నుండి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, ఈ నెల 6వ తేదీ నుండి జనవరి 8 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులు ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని, ప్రజల యొక్క భూ సమస్యలు, రీ సర్వే సమస్యలు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు.కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్లో పాల్గొన్నారు. జిల్లాలో రెవెన్యూ సదస్సుల సిద్ధపాటు ఏర్పాట్లపై కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్లో వివరిస్తూ జిల్లాలో మొత్తం 495 గ్రామాలకు గాను 290 గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేసినట్లు, ఇందుకు సంబంధించిన గ్రామసభలు కూడా నిర్వహించినట్లు తెలిపారు. ఈ నెల 6వ తేదీ నుంచి జిల్లాలో రెవెన్యూ సదస్సులు నిర్వహించుటకు షెడ్యూల్ రూపొందించినట్లు తెలిపారు, ముందుగా రీ సర్వే జరగని గ్రామాల్లో, తదుపరి సర్వే పూర్తయిన గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. ప్రతి గ్రామంలో సచివాలయం సిబ్బందితో రెవెన్యూ సదస్సులలో కౌంటర్లు ఏర్పాటు చేసి, భూ సమస్యలపై అర్జీలు స్వీకరించి వాటికి రసీదులు ఇచ్చేందుకు కూడా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, డి ఆర్ ఓ కె చంద్రశేఖర రావు, సర్వే ఏడి జోషిలా, సంబంధిత సెక్షన్ సిబ్బంది సుభాష్, నారాయణ పాల్గొన్నారు.



పంటలకు బీమా చేసుకోవాలి : జెడిఎ

ప్రజాశక్తి-గన్నవరం: ముస్తాబాద్, సూరంపల్లి గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యమంలో రైతులకు ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన క్రింద రబీకి క్రాప్ ఇన్సూరెన్స్ చేయించుకోవాలని జెడిఎ పద్మావతి తెలిపారు. వరికి డిసెంబర్ నెలాఖరు వరకు సమయం ఉందని, మినుము, పెసర, మొక్కజొన్నకు డిసెంబర్ 15 వరకు సమయం ఉందని తెలిపారు. ఈ ఇన్సూరెన్సు ప్రీమియం అనేది సచివాలయంలో చేసుకునే అవకాశం ఉందన్నారు. దీనిని కౌలు రైతులు వినియోగించుకోవాల్సిందిగా కోరారు. అలాగే కౌలు కార్డు, ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్ బుక్ తీసుకుని వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడిఎ సునీల్, గన్నవరం ఎంఏఓ రజనీ, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కళ్లజోళ్లు పంపిణీ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో లయన్ నర్రా గంగాధరరావు ఆర్థిక వితరణతో మండలంలోని వడ్లమన్నాడు, విన్నకోట గ్రామాల్లోని జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని విద్యార్థులకు 20 వేల రూపాయల విలువ గల కళ్లజోళ్లు బుధవారం పంపిణీ చేశారు. విన్నకోట హైస్కూల్లో 50 మంది విద్యార్థులకు, వడ్లమన్నాడు హైస్కూల్లో 27 మంది విద్యార్థులకు కళ్లజోళ్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఫస్ట్ వైస్ గవర్నర్ లయన్ వివిపిఎస్ ఆంజనేయులు ముఖ్యఅతిథిగా పాల్గొనగా ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు శశికళ, వైపీసీ ప్రసాద్, పి.విజయ్, పరంధామయ్య, సుధాకర్, ప్రభాకరరావు, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి లంక నరేంద్ర పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రాల్లో పనుల పూర్తికి చర్యలు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

జిల్లాలో అంగన్వాడీ కేంద్రాల్లో టాయిలెట్స్ నిర్మాణ పనులు, మరమ్మత్తు పనులు సత్వరమే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆర్డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ బుధవారం కలెక్టరేట్ మీటింగ్ హాలులో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమావేశం నిర్వహించి తాగునీటి పథకాల మరమ్మత్తు పనులు, అంగన్వాడీ టాయిలెట్ నిర్మాణాలు, మరమ్మత్తు పనులు, సిఎస్ఆర్, ఎంపీ లాడ్స్, జిల్లా మినరల్ ఫండ్ నిధులతో చేపట్టిన పనుల పురోగతి మండల వారీగా సమీక్షించారు. అంగన్వాడీలలో కొత్త టాయిలెట్ల నిర్మాణం, పాత వాటికి మరమ్మత్తులు, గతంలో సగంలో వదిలేసిన టాయిలెట్ ల నిర్మాణం పూర్తి చేసే పనులు ఆలస్యం కావడం పట్ల కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓవరాల్ గా ఆర్డబ్ల్యూఎస్ డిపార్ట్మెంట్ చేపట్టిన పనులు 25 శాతం కూడా పూర్తి చేయకపోవడం పట్ల కలెక్టర్ అసహనం వ్యక్తం చేస్తూ చేపట్టిన పనుల పురోగతి సాధించేవరకు ప్రతి వారం ఆర్ డబ్ల్యు ఎస్ ఏఈ లతో సహా పనుల పురోగతిపై సమీక్షిస్తామన్నారు. జల జీవన్ మిషన్ పనులు పూర్తి కాకపోవడానికి, పనులు చేపట్టుటకు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడానికి అధికారులే కారణమని, కాంట్రాక్టర్లను బిల్లుల కోసం తిప్పుకుంటారని, పనులలో సీరియస్నెస్ ఉండడం లేదని అన్నారు. నాన్ స్టార్టెడ్ పనులు వెంటనే ప్రారంభించి త్వరగా పూర్తి చేయాలని అన్నారు.ఈ సమావేశంలో ఆర్డబ్ల్యూఎస్ ఈ ఈ నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

'పుష్ప-2'ను అడ్డుకుంటాం : రమేష్

ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్ (గన్నవరం)

పుష్ప-2 సినిమా ప్రీమియం షోను అడ్డుకుంటామని జనసేన గన్నవరం నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మెగా ఫ్యామిలీ అండదండలతో సినిమా రంగంలో ఎదిగిన అల్లు అర్జున్, ఆ విషయం మర్చిపోయి మెగా ఫ్యామిలీపై నోరు పారేసుకోవడం సరికాదన్నారు. ముఖ్యంగా పవన్ కళ్యాణ్ విషయంలో అల్లు అర్జున్ చాలా దారుణంగా వ్యవహరిస్తున్నారని, అతని పోకడలను చిరంజీవి అభిమానులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని, జనసేన కార్యకర్తల్లోనూ అతనిపై విపరీతమైన కోపం ఉందని తెలిపారు. పుష్ప-2 ప్రీమియం షో సినిమాను హనుమాన్ జంక్షన్‌లో అడ్డుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికైనా పవన్ కళ్యాణ్, చిరంజీవి కుటుంబాలకు అల్లు అర్జున్ క్షమాపణ చెప్పాలన్నారు.



రేపు గుడివాడలో జాబ్‌మేళా

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన శాఖ, డిఆర్‌డిఎ, సీడాప్, ప్రభుత్వ ఐటిఐ కళాశాల గుడివాడ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 6వ తేదీ శుక్రవారం గుడివాడలోని ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి డి.విక్టర్‌బాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డాక్టర్ పి. నరేష్‌కుమార్, గుడివాడ ప్రభుత్వ ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.గౌరీమణి తెలిపారు. ఈ జాబ్ మేళాలో హెటిరో ల్యాబ్స్ లిమిటెడ్, కురాకు ఫైనాన్సియల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ వంటి ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయని పేర్కొన్నారు. ఈ కంపెనీలలో గల ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, ఐటిఐ (ఫిట్టర్), డిప్లొమా (మెకానికల్, ఎలక్ట్రికల్, కెమికల్), డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన 18 నుండి 30 సంవత్సరాల్లోపు వారు అర్హులని తెలిపారు. ఆసక్తి గల వారు ముందుగా https://naipunyam.ap.gov.in/user-registration ద్వారా తమ పూర్తి వివరాలతో రిజిస్టర్ కావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 98488 19682, 96666 54641 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

సిపిఆర్‌పై అవగాహన



ప్రజాశక్తి-మోపిదేవి: మనిషి ఒక్కసారిగా కుప్ప కూలిపోయినప్పుడు సిపిఆర్‌తో ప్రాణాపాయం నుంచి తప్పించవచ్చని డాక్టర్ వంగర శేషగిరిరావు వివరించారు. ఆరోగ్య భారతి ధన్వంతరి జయంతి ఉత్సవాలలో భాగంగా శ్రీ జ్యోతిరావు పూలే ఆశ్రమ జూనియర్ కళాశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో డాక్టర్ వంగర శేషగిరిరావు, ఆరోగ్య భారతి జిల్లా అధ్యక్షులు డాక్టర్ గుడిసేవ విష్ణుప్రసాద్ నేతృత్వంలో కళాశాల అధ్యాపకులు మల్లేశ్వరరావు అధ్యక్షత అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా శేషగిరిరావు మాట్లాడుతూ గుండెపోటుతో మరణించిన వ్యక్తిని మరలా బతికించడానికి సిపిఆర్ ఒక్కటే మార్గమన్నారు. వ్యక్తి చనిపోయినట్లు నిర్ధారణ అయిన తర్వాత వెంటనే సిపిఆర్ చేస్తే బతుకుతారని, ఈ ప్రక్రియపై యువత అవగాహన కలిగి ఉండాలన్నారు.



గ్రంథాలయ అభివృద్ధికి చర్యలు : రవికుమార్

ప్రజాశక్తి-గుడివాడ: గ్రంథాలయ అభివృద్ధికి ప్రభుత్వపరంగా చర్యలు తీసుకుంటామని సంస్థ కార్యదర్శి వేములపల్లి రవికుమార్ అన్నారు. బుధవారం స్థానిక షా గులాబ్ చంద్ ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయాన్ని కష్ణజిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వేములపల్లి రవికుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్షిక తనిఖీలో భాగంగా గ్రంథాలయానికి రావడం జరిగిందన్నారు. గ్రంథాలయ భవనం శిథిలావస్థలో ఉందన్నారు. దీనిని త్వరలోనే నిధులు మంజూరయ్యేల కృషి చేస్తామన్నారు. గ్రంథాలయంలోని సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి బీరం వెంకటరమణ, సిబ్బంది టి.ప్రవల్లిక, పి.రవిచంద్ర, పాఠకులు పాల్గొన్నారు.

నిమ్మల బావిని ఆధునీకరించాలి : సిపిఎం

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ పట్టణ శివారు అనాసాగరం గ్రామంలో పాడైన నిమ్మల బావిని ఆధునీకరించాలని గ్రామ సిపిఎం నాయకులు కరి వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనాసాగరం గ్రామంలో దశాబ్దాల తరబడి వాడుకలో ఉన్న నిమ్మల బావిని అధికారులు పట్టించుకోకపోవడం నిరుపయోగంగా మారింది. పిచ్చి కంప పెరిగి చెత్త, చెదారం, మట్టితో బావి పూడుకుపోయింది. గతంలో ఈ బావినే ప్రజలు తాగునీటికి వాడుకునేవారు. జాతీయ రహదారి పక్కన బావి ఉండటంతో పాదచారులతో పాటు దూర ప్రాంతాలకు వెళ్ళే ప్రయాణికులకు కూడా దాహార్తి తీర్చింది. అనాసాగరంలో ఏ కార్యక్రమం జరిగినా ఈ బావి ప్రజలకు ఉపయోగపడింది. పెళ్లిలు, వివాహం, వీరుల కొలువు, కర్మకాండలకు స్నానాలు చేయటానికి నిమ్మల బావి ఎంతో ఉపయోగపడేదని సిపిఎం నాయకులు కరి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం నిమ్మల బావిని బాగు చేయాలని కోరారు. అధికారులు స్పందించి నిమ్మల బావిని పూర్తిగా ఆధునీకరించాలని గ్రామ పెద్దలు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అనాసాగరం గ్రామ నాయకులు కర్రి నాగేశ్వరరావు, బాబు పలువురు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



కోతకు గురై ప్రమాదకరంగా ఉన్న రహదారి

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు నుండి విజయవాడ వెళ్లే జాతీయ రహదారి (ఎన్ హెచ్ – 30) అర్ అర్ గ్రాండ్ రెస్టారెంట్ సమీపంలో వాహన దారులకు ప్రమాదం పొంచి ఉంది. గత సెప్టెంబర్ మొదటి వారంలో కురిసిన భారీ వర్షాలకు జాతీయ రహదారిపై వరద ఉధృతంగా పొంగిపొర్లడంతో రెస్టారెంట్ వద్ద జాతీయ రహదారి మార్జిన్ సుమారు 100 మీటర్ల మేర కోతకు గురైంది. ఇది జరిగి నాలుగు నెలలు అవుతున్నా జాతీయ రహదారి అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తుండటంతో వాహనదారులు బిక్కు బిక్కు మంటూ డ్రైవింగ్ చేస్తున్నారు. విజయవాడ, భద్రాచలం, చత్తీస్‌ఘడ్, ఖమ్మం తదితర ముఖ్య మైన ప్రాంతాలకు రేయింబవళ్లు భారీ వాహనాలు సైతం నిత్యం వెళ్తూ ఉంటాయి. రెస్టారెంట్ సమీపానికి రాగానే ఎదురు ఎదురుగా వచ్చే వాహనాలకు దారిచ్చే క్రమంలో డ్రైవర్లు భయాందోళన చెందుతున్నట్లు పలువురు డ్రైవర్లు అవేదన వ్యక్తం చేస్తున్నారు.

క్రీడాకారిణికి సాయం

ప్రజాశక్తి - తిరువూరు : జాతీయ స్థాయి స్కై మార్షల్ ఆర్ట్స్‌లో ఎంపికైన విద్యార్థినికి దోస్త్ పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు బుధవారం ఆర్థిక సహాయం అందజేశారు. తిరువూరు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని బిక్కా కావ్యశ్రీ 7, 8, 9 తేదీల్లో హర్యానాలో జరగనున్న జాతీయ స్థాయి స్కై మార్షల్ ఆర్ట్స్ పోటీలకు ఎంపికైంది. పోటీల్లో పాల్గొనేందుకు వెళ్తున్న కావ్యశ్రీకి ఖర్చుల నిమిత్తం దోస్త్ పూర్వ విద్యార్థుల సంఘం కొంత నగదును ఆర్థిక సహాయంగా అందజేశారు. ఆమె జాతీయ క్రీడల్లో రాణించాలని దేశానికి కీర్తి ప్రతిష్ఠలు తీసుకురావాలని దోస్త్ పూర్వ విద్యార్థులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కొసరాజు కృష్ణాసాయి, చిత్తలూరి సోమశేఖర్, పరసా నెహ్రూజీ, మేడూరి రవిశంకరప్రసాద్, కొత్తగుండ్ల సురేష్, గుడివాడ నరేంద్ర, గట్ల మురళీ కృష్ణ పాల్గొన్నారు.

సారా విక్రేత బైండోవర్

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : మైలవరం ఎక్సైజ్ సుర్కిల్ పరిధిలో సారా కేసుల్లో పాత ముద్దాయిలైన రెడ్డిగూడెం మండలం ఓబుళాపురానికి చెందిన పరికెల కోటేశ్వరరావు, వేముల మసయ్య, రుద్రవరం తండాకు చెందిన ధారవత్‌రాణిని రెడ్డిగూడెం తహశీల్దార్ సుశీలదేవి ఎదుట బైండ్ ఓవర్ చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

వసతి గృహానికి ఫ్యాన్లు వితరణ

ప్రజాశక్తి - తిరువూరు : భారతీయ స్టేట్ బ్యాంకు తిరువూరు మెయిన్ బ్రాంచ్ ఉద్యోగులు స్థానిక సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహానికి 11 సీలింగ్ ఫ్యాన్లు వితరణ చేశారు. వసతి గృహానికి ఫ్యాన్లు అవసరాన్ని గుర్తించి బుధవారం వసతి గృహ అధికారులకు అందజేసినట్లు బ్రాంచ్ మేనేజర్ రవికుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టేట్ బ్యాంకు ఆఫీసర్స్ అసోసియేషన్ ఉప ప్రధాన కార్యదర్శి విజయ శేఖర్, ఆఫీస్ బేరర్స్, విశ్రాంత ఉద్యోగి ఆనందరావు, తిరువూరు, రాజుపేట, మైలవరం, కంభంపాడు బ్యాంకుల సిబ్బంది పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: పట్టణంలో కోదాడ రోడ్డులో గల మార్కెట్ యార్డులో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) 2024–2025 పత్తి కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఎంఎల్ఎ శ్రీరాం రాజగోపాల్ తాతయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కొఠారు సత్యనారాయణ ప్రసాద్, కట్ట వెంకట నరసింహారావు, మైనేని రాధాకృష్ణ, యానాల గోపీచంద్, గట్టిడి దుర్గాప్రసాద్, అధికారులు, రైతులు పాల్గొన్నారు.



కొబ్బరి ఉత్పత్తుల తయారీలో శిక్షణ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: మండలంలోని గరికపాడు కృషి విజ్ఞాన కేంద్రంలో బుధవారం ఆత్మ వారి సౌజన్యంతో ఒకరోజు శిక్షణా కార్యక్రమంలో భాగంగా కొబ్బరితో చేసిన నాలుగు రకాలైన ఉత్పత్తులు గ్రామీణ యువతులు ప్రదర్శించారు. కొబ్బరి లడ్డూలు, కొబ్బరి నూనె, కొబ్బరి నిల్వ పచ్చడి, కొబ్బరి చాక్లెట్లు వారు స్వయంగా చేయడమే కాకుండా అధికారులకు అందించి తాము కూడా ఇంద్రియ గుణాలను సూచించారు. కొబ్బరితో చేసిన ఉత్పత్తులు ఉపాధి కూడా చేపట్టడం వలన గ్రామీణ యువత ఎంతో ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చని సమన్వయకర్త డాక్టర్ కె అచ్యుతరాజు తెలిపారు. డాక్టర్ ప్రభావతి గృహ విజ్ఞాన శాస్త్రవేత్త ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రభావతి మాట్లాడుతూ కొబ్బరి, నీరు కలెక్ట్ చేసి ఉత్పత్తులు తయారు చేసి అమ్మడం వల్ల ఆదాయాన్ని అర్జించవచ్చని తెలపారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ ఐ.వెంకట్ రెడ్డి, డాక్టర్ శివప్రసాద్, డాక్టర్ జస్వంత్ రెడ్డి, డాక్టర్ రాజశేఖర్, కెవికె శాస్త్రవేత్తలు, కె.వి.కె అదనపు సిబ్బంది , మహిళలు, యువత పాల్గొన్నారు.

జీతాలు చెల్లించాలని మున్సిపల్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణ పురపాలక సంఘ పరిధిలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికుల జీతాలు చెల్లించాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. పాత మున్సిపల్ కార్యాలయం ఎదుట జరిగిన ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు, 5వ వార్డు కౌన్సిలర్ వట్టెం మనోహర్ మున్సిపల్ కార్మికులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ గత రెండు నెలలుగా మున్సిపల్ కార్మికులకు జీతాలు చెల్లించడం లేదన్నారు. గతంలో మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. నవంబర్ 30న జరిగిన మున్సిపల్ సమావేశంలో మున్సిపల్ కార్మికుల జీతాల విషయంపై ప్రస్తావించినట్లు తెలిపారు. డిసెంబర్ 1న కార్మికులకు జీతాలు అందజేస్తామని చెప్పి ఇప్పటి వరకు జీతాలు ఇవ్వలేదన్నారు. జీతాలివ్వకుంటే ఆందోళనలు చేపడతామని తెలిపారు.

రేషన్ డీలర్, ఆపరేటర్లపై కేసు

ప్రజాశక్తి - తిరువూరు : చౌకధరల దుకాణంలో కార్డుదారులకు అందించాల్సిన నిత్యావసర సరుకులను పక్కదారి పట్టిస్తున్న రేషన్ డీలర్, ఎమ్‌డియు ఆపరేటర్లపై తిరువూరు ఆర్‌డిఒ కె.మాధురి బుధవారం కేసులు నమోదు చేశారు. స్థానిక శాంతినగర్‌లోని రేషన్ షాప్‌ను, ఎమ్‌డియు ఆపరేటర్ మిద్దె సురేష్, రేషన్ సరుకులను సక్రమంగా పంపిణీ చేయట్లేదని వచ్చిన ఫిర్యాదు మేరకు ఆర్‌డిఒ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వీరిపై 6–ఎ కేసు నమోదు చేసినట్లు మాధురి తెలిపారు. తనిఖీలో పిడిఎస్ డిటి నాగరాజు పాల్గొన్నారు.



బాధితుడికి సిఐటియు పరామర్శ



బాధితుడితో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: విధులు నిర్వహిస్తూ గాయాలపాలైన బాధితుడికి నష్టపరిహారం ఇవ్వాలని, పూర్తిగా కోలుకునే వరకు యాజమాన్యం వైద్య ఖర్చులు భరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎ.వెంకటేశ్వరరావు, జిల్లా నాయకులు ఎం.సోమేశ్వరావులు డిమాండ్ చేశారు. పట్టణ సమీపంలోని విశాఖ స్టీల్ ప్లాంట్లో ఎలక్ట్రికల్ సెక్షన్‌లో పని చేస్తుండగా గాయాలపాలై తాడేపల్లి మణిపాల్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న బూదవాడకు చెందిన కార్మికుడు పొదిలి గంగరాజును సిఐటియు నాయకులు బుధవారం పరామర్శించారు. గంగరాజు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.

మురుగుకాల్వ పారుదలకు అడ్డంకులు

ప్రజాశక్తి- నందిగామ : నందిగామ మున్సిపల్ ఆఫీసు ఎదురుగా ప్రధాన మురికి కాలువకి తూములు వేసి దానిపైన మట్టి పోసి మురికి నీరు పారుదల కాకుండా చేస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ఇలాంటి పరిస్థితి నెలకొంది. అలాగే ఆ షాపుకు ప్రక్కనే ఎంత ప్రైవేటు స్థలం ఉందో కూడా అధికారులకు తెలియని పరిస్థితుల్లో అక్కడ మరో షాపు నిర్మాణం చేస్తున్నారు. దీనికి పురపాలక సంఘం టౌవున్ ప్లానింగ్ అధికారుల అనుమతులు ఉన్నయో లేవో తెలియదు.కాని నిర్మాణం జరిగిపోతుంది. అక్కడే రైతు పాల దుకాణం గతంలో నగర పాలక అధికారులు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. అప్పుడు దీనిపై విమర్శలు రావడంతో అధికార పార్టీ నాయకులు మున్సిపల్ అధికారులపై ఒత్తిడి చేసి కొనసాగించరనే ఆరోపణలు ఉన్నాయి. ఆ కట్టడానికి ప్లాన్ అనుమతులు లేకుండా కేవలం కంటైనర్ షాపు అంటూ అనుమతులు లేకుండా చేశారు. దీని అలుసు తోనే ప్రస్తుతం పక్కనే మరో కట్టడం జరుగుతుంది. అలాగే టీ స్టాల్ పరిస్థితి. వీరందరూ కలిసి రైతు బజార్ వద్ద నుంచి డ్రైనేజీ నీరు లక్షలాది రూపాయలు ఖర్చు చేసి ఎర్పాటు చేసిన కల్వర్టు ద్వారా వెళ్ళకుండా అడ్డు కుంటున్నారు. దీని కారణంగా ఆ ప్రాంతంలో ట్రాఫిక్ జామ్ సమస్యా, మురుగు నీరు పారుదల లేక దుర్వాసన వస్తుంది. తక్షణమే పురపాలక సంఘం అధికారులు ఆ బిల్డింగ్ లీజుకు ఇచ్చిన వారిని పిలిపించి డ్రైనేజీ ఆక్రమణలు తొలగించాలని, పూర్తిగా డ్రైనేజీ ప్రక్షాళన చేయాలని, ప్రస్తుతం అక్కడ నూతనంగా నిర్మిస్తున్న కట్టడానికి అనుమతులు ఉన్నాయో లేవో పరిశీలించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



నందిగామలో మురుగునీరు వెళ్లకుండ ఉన్న ప్రాంతాలను పరిశీలిస్తున్న కమిషనర్ ఇవి రమణ బాబు

రైతు సమస్యల పరిష్కారానికి సదస్సులు



ప్రజాశక్తి - రెడ్డిగూడెం : కలెక్టర్ ఆదేశాలపై రెడ్డి గూడెం మండలంలో 6వ తేదీ నుండి 8వ తేదీ వరకు ప్రతి గ్రామ న చివలయంలో రైతు సదస్సులు జరుగుతాయని తహశీల్దార్ సుశీలదేవి తెలిపారు. ఆ సదస్సులో రెవెన్యూ, ఫారెస్ట్, వ్యవసాయ శాఖ, పోలీసు ఇండోమెంట్. వక్ఫ్ బోర్డ్, మెడికల్, సబ్–రిజిస్ట్రేషన్ శాఖ లవారు హాజరవుతారని తెలిపారు. భూ సంబంధ సమస్యలున్న రైతులు తగు ఆధారాలతో దరఖాస్తులు రెవెన్యూ సదస్సులలో దాఖలు చేసుకోవాలని తెలిపారు. బుధవారం ఉదయం నాగులూరు గ్రామంలో ప్రజాపంపిణీ బియ్యం వాహనాన్ని, రేషన్ షాపును తనిఖీ చేశారు. లబ్ధిదారులను బియ్యం పంపిణీపై వివరాలడిగి తెలుసుకున్నామని ఆమె తెలిపారు.

ఎన్నికల సిబ్బందికి శిక్షణ

ప్రజాశక్తి - వత్సవాయి : నీటి సంఘాలు ఎన్నికలను సిబ్బంది సమర్థవంతంగా నిర్వహించాలని తహశీల్దార్ శాంతిలక్ష్మి అన్నారు. ఈ నెల 8న సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణపై స్థానిక రామాలయం వద్దనున్న ఫంక్షన్ హాల్‌లో ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో సంఘాలుండగా 18 నీటి సంఘాలు ఉండగా జగ్గయ్యపేటకు నాలుగు, పెనుగంచిప్రోలుకు ఏడు, వత్సవాయికి 7, నీటి సంఘాలున్నాయి. ఈ సంఘాల్లో మొత్తం 40 వేలకు పైగా ఓటర్లు ఉన్నారు. డిసెంబర్ 8న సాగునీటి సంఘాలకు 11 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు 14 ప్రాజెక్టు కమిటీ ఎన్నికలు నిర్వహిస్తారు. సభ్యులందరూ తప్పక ఓటును వినియోగించుకోవాలని కోరారు. ప్రభుత్వం ఇందుకోసం తగు ఏర్పాటు చేస్తుందని తెలిపారు. కారులో సిబ్బంది సమర్థవంతంగా పనిచేసి ఎన్నికల సహజవుగా పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు.

పంటబీమాలో పేర్లు నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి - తిరువూరు : రబీలో సాగుచేసే రైతులు అందరు పంటల బీమాలో తమ పేర్లను తప్పనిసరిగా నమోదు చేయించు కోవాలని జిల్లా వనరుల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ టి.మాధవిలత అన్నారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం గురించి ఆర్.ఎస్.కె. సిబ్బందికి స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం శిక్షణ ఇచ్చారు. రైతులు తమ పంట పొలాలకు బీమా కట్టుకోవటానికి కామన్ సర్వీస్ సెంటర్లో రబీ క్రాప్ ఇన్సూరెన్స్ పోర్టల్ లాగిన్ ఓపెన్ అవు తుందన్నారు. వారి వారి పంట పొలాలకు ఇన్సూరెన్స్ చేయించుకోవాలని ఆమె రైతులకు విజ్ఞప్తి చేశారు. ఎడిఎ జి.కెనడి, ఎఒలు పి.పద్మ, షేక్ టిప్పుసుల్తాన్, కె.వెంకటేశ్వరావు ఆర్‌ఎస్‌కె సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాధవిలత

మిల్లర్లు మద్దతు ధరకు కొనకుంటే కేసులు

ధాన్యం కొనుగోళ్లపై సమీక్షలో మంత్రి నాదెండ్ల మనోహర్



మోపిదేవిలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న మంత్రి మనోహర్

ప్రజాశక్తి-అవనిగడ్డ: ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయని రైస్ మిల్లర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ హెచ్చరించారు. బుధవారం అవనిగడ్డలోని రెవెన్యూ సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ కొందరు దళారులు, మిల్లర్లు అలజడి సృష్టించి రైతులను ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు సేవా కేంద్రాల ద్వారా ఇప్పటికే రాష్ట్రంలో రూ 280 కోట్ల ఖరీదు చేసే ధాన్యాన్ని కొనుగోలు చేసిందన్నారు. కృష్ణాజిల్లాలో 1.24 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. ధాన్యం విక్రయించిన రైతులకు 24 గంటల్లో 93 శాతం మందికి సొమ్ము చెల్లించినట్లు మంత్రి చెప్పారు. కౌలు రైతులకు కూడా ఈ క్రాప్ నమోదు చేసి ధాన్యం సొమ్ము నేరుగా వారి ఖాతాలకే జమ చేస్తున్న ఘనత తమ కూటమి ప్రభుత్వానికి దక్కిందన్నారు రైతులు తమకు నచ్చిన మిల్లుకే ధాన్యం అమ్ముకునే అవకాశం కల్పించడంతోపాటు జీపీఎస్ నిబంధన కూడా తొలగించామన్నారు డ్రై య ర్ల సౌకర్యం ఉన్న మిల్లులకు కింటాకు తొమ్మిది రూపాయలు ఎఫ్సీఐ ద్వారా నిధులు అందిస్తామన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా వాట్సాప్ సేవలు వినియోగించుకొని 73373 593 75 నెంబర్‌కు రైతు హాయ్ అని ఫోన్ చేస్తే అధికారులే రైతు వద్దకు వచ్చి ధాన్యం కొనుగోలు చేసే సౌకర్యం తెచ్చినట్లు తెలిపారు. రైతు పండించిన 1262 రకం ధాన్యం మొత్తం మిల్లర్లు కొనాలని మంత్రి ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల సిబ్బంది ప్రతిరోజూ తప్పనిసరిగా ఐదారు గంటల క్షేత్రస్థాయిలో తిరిగి రైతులకు సహకరించాలని మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యువ నాయకులు మండల వెంకట్ రామ్, రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ డైరెక్టర్ బోడపాటి శివ దత్తు, ఏపీ ఐసీసీ డైరెక్టర్ మండలి రాజేష్, డిఎస్ఒ వి పార్వతి ఆర్డీవో కే స్వాతి, సివిల్ సప్లై డిఎం పద్మరాణి పాల్గొన్నారు

దళారులను నమ్మి మోసపోవద్దు

ప్రజాశక్తి-మోపిదేవి: ప్రతి గింజా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, దళారులను నమ్మి మోసపోవద్దని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. బుధవారం పెదప్రోలులో రైతులతో మాట్లాడారు. తమ తోటి రైతులు ధాన్యం ప్రభుత్వానికి డబ్బులు పడ్డాయని చెబుతున్నప్పుడు మంత్రి వారితో కలిసి సంతోషం వ్యక్తం చేశారు. స్థానిక శాసనసభ్యులు మండల బుద్ధ ప్రసాద్, నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



ఘంటసాల జయంతి

ప్రజాశక్తి-అవనిగడ్డ: అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు 102వ జయంతి వేడుకలు అవనిగడ్డలో ఘనంగా నిర్వహించారు. బుధవారం ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ కార్యాలయం వద్ద గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షులు మండలి వెంకట్రాం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఘంటసాల చిత్రపటానికి ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ పూల దండలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ వెంకటేశ్వరరావు గానామృతం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో లలిత కళా సమితి ప్రధాన కార్యదర్శి కూనప రెడ్డి చంద్రశేఖర్, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, టిడిపి మండల అధ్యక్షులు యాసం చిట్టిబాబు, నాయకులు బండే రాఘవ, ఘంటసాల కన్నయ్య తదితరులు పాల్గొన్నారు. ఘంటసాల స్మారక సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో నవజీవన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో నిర్వహించిన ఘంటసాల జయంతి ఆ సంఘం అధ్యక్షులు కొండవీటి ఈశ్వరరావు అధ్యక్షతన జరిగింది. గౌరవ అధ్యక్షులు సారంగపాణి, న్యాయవాది రామిశెట్టి వేణుగోపాలరావు ఘంటసాల చిత్రపటానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఘంటసాల స్మృతులను గుర్తు చేసుకుంటూ ఆయన పాటలను ఆలపించి సభికులను పరవశింపజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌విఎల్ క్రాంతి కళాశాల కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు, జి సూర్యనారాయణ, విశ్రాంతి ఉపాధ్యాయులు కూనపరెడ్డి చంద్రశేఖర్, తుంగల పాండురంగారావు పాల్గొన్నారు.

7న సిఎం పర్యటనకు పగడ్బందీ ఏర్పాట్లు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): ఈ నెల 7న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పెనమలూరు మండలం కానూరు గ్రామంలోని మురళీ రిసార్ట్స్‌లో ఉర్జవీర్ కార్యక్రమం ప్రారంభోత్సవంలో పాల్గొంటారని, అందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక సమావేశపు మందిరంలో జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మతో కలిసి ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై వివిధ శాఖల జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎనర్జీ ఎఫిసియన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్‌ఎల్) ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఉర్జవీర్ కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి, కేంద్ర విద్యుత్ శాఖ మంత్రితో కలిసి లాంఛనంగా ప్రారంభిస్తారని, అధికారులందరూ సమిష్టిగా పనిచేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ కె చంద్రశేఖర రావు, జెడ్పి సీఈవో కే కన్నమ నాయుడు, బందరు, గుడివాడ, ఉయ్యూరు రెవెన్యూ డివిజన్ల అధికారులు కే స్వాతి, జి బాలసుబ్రమణ్యం, బీఎస్ హేలా షారోన్, విద్యుత్ శాఖ ఎస్ఈ సత్యానందం తదితర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మహిళలపై హింస నిర్మూలనకు కృషి చేద్దాం : సేఫ్

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: మహిళలపై హింస అరికట్టాలంటే ముందు గహ హింస ఆగాలని , మహిళ సమాజం లో స్వేచ్ఛ గా తన సమస్య వ్యక్తం చేసే పరిస్థితి రావాలని సిద్ధార్థ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ సునీత అన్నారు. స్థానిక ఆంధ్రా లయోలా ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం మహిళలపై హింసను సహించవద్దంటూ సెమినార్ జరిగింది. సేఫ్ కమిటీ, లయోలా ఇంజనీరింగ్ కళాశాల సంయుక్తంగా ఈ సెమినార్ నిర్వహించాయి. ఈ కార్యక్రమం సేఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు గుళ్ళపల్లి జ్యోత్స్న కు నివాళులర్పించింది. సెమినార్‌లో వక్త గా పాల్గొన్న సునీత మాట్లాడుతూ మహిళలు స్వేచ్ఛగా తన సమస్యలను చెప్పగలిగినప్పుడు పరిష్కార మార్గాలు కూడా ఉంటాయని తెలిపారు. సమాజంలో అలాంటి పరిస్థితులు రావాలనే ఉద్దేశం తోటే మహిళలపై హింస సహించం అంటూ యునెస్కో అంతర్జాతీయంగా నవంబర్ 25 ను మహిళలపై హింస



నిర్మూలన దినముగా పాటిస్తున్నదని వివరించారు.ఎస్ ఆర్ కే ఇంజనీరింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ ఏ సుజిత్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం స్త్రీకి అన్నింటా సమాన అవకాశాలు కల్పించిందని చెప్పారు. కానీ మహిళలకు ఉన్న అవకాశాలు అణిచివేయాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అభ్యుదయ భావాలతోటి , రాజ్యాంగ విలువలను కాపాడుతూ మహిళలపై హింస అరికట్టాల్సి ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సేఫ్ కమిటీ సభ్యులు కె.స్వరూపారాణి. సేఫ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు

6న సేఫ్ 1 కె వాక్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

మహిళలపై హింసక వ్యతిరేకంగా, మానవ హక్కులు పరిరక్షించాలని కోరుతూ సేఫ్ ఆధ్వర్యాన ఈనెల ఆరో తేదీన 1 కె వాక్ నిర్వహించనున్నారు. మహిళలపై హింసను సహించం అంటూ అంతర్జాతీయంగా పక్షం రోజులపాటు జరుగుతున్న కార్యక్రమాలలో భాగంగా శుక్రవారం ఉదయం 7 గంటలకు 1 కె వాక్ నిర్వహిస్తున్నట్టు సేఫ్ కమిటీ ఒక ప్రకటనలో తెలియజేసింది. ఈ వాక్‌లో హైకోర్టు న్యాయమూర్తి కే మన్మధరావు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి లక్ష్మిషా, నగర మున్సిపల్ కమిషనర్ హెచ్‌ఎం ధ్యానచంద్ర, కళాశాలల విద్యార్థిని విద్యార్థులు పాల్గొంటారని తెలిపింది. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుండి ఫార్చ్యూన్ మురళి పార్క్ వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సేఫ్ కమిటీ కోరింది.

మానవ హక్కుల ప్రాధాన్యతను తెలియజేస్తా

ప్రజాశక్తి-పమిడిముక్కల: మానవ హక్కులకు ఎటువంటి భంగం కలగకుండా వాటిని సంరక్షించడానికి కృషి చేస్తానని, మానవ హక్కుల ప్రాధాన్యతను ప్రజలకు వివరిస్తామని మానవ హక్కుల జాతీయ కమిషన్ డైరెక్టర్ భుజంగానాయక్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తనపై నమ్మకంతో మానవ హక్కుల జాతీయ కమిషన్ డైరెక్టర్‌గా బాధ్యతలు అప్పగించినందుకు తగిన న్యాయం చేస్తానని అన్నారు. పలు ప్రాంతాల్లో పర్యటించి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పార్టీలకతీతంగా అందరికీ న్యాయం చేస్తానన్నారు.



లంక గ్రామాల్లో పశువుల ఆశ్రయానికి నిర్మాణాలు : కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): రాబోయే ప్రకతి వైపరీత్యాలను ఎదుర్కొనేందుకు జిల్లాలోని లంక గ్రామాలలో పశువుల ఆశ్రయ నిర్మాణాలు ఆవశ్యకమని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ రాష్ట్ర హోం మంత్రికి వివరించారు. బుధవారం రాష్ట్ర హోమ్‌మంత్రి వంగలపూడి అనిత వారి క్యాంప్ కార్యాలయం నుండి విపత్తుల నిర్వహణపై జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పాల్గొన్నారు.జిల్లాలో ప్రకతి వైపరీత్యాలను సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు గత అనుభవాలను దష్టిలో పెట్టుకొని సలహాలు, సూచనలు, సమస్యలు తెలియజేయాలని రాష్ట్ర హోమ్ మంత్రి జిల్లా కలెక్టర్లకు సూచించగా, కష్ణా జిల్లాకు సంబంధించిన పరిస్థితులను కలెక్టర్ వివరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతికూల వాతావరణం సమయంలో జిల్లా పరిధిలోని కష్ణానది పరివాహక ప్రాంతంలో నివసిస్తున్న లంక గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నప్పటికీ ప్రజలు ముందుకు రాలేదన్నారు. దీనికి ముఖ్య కారణాన్ని కలెక్టర్ వివరిస్తూ ఆయా గ్రామాలలోని ప్రజలు పశువులను కలిగి ఉండటం, ఆ సమయంలో వాటిని వదిలి వస్తే ఎమైపోతాయోనన్న ఆందోళనతో సురక్షిత ప్రాంతాలకు వారు రావడం లేదని తెలిపారు. ఈ నేపథ్యంలో వారి పశువుల కోసం పశువుల ఆశ్రయాలు (క్యాటిల్ షెల్టర్స్) నిర్మిస్తే ఆ భరోసాతో ప్రజలు ముందుకు వస్తారని తెలిపారు.

అసంబద్ధ నిర్ణయాలను రద్దు చేయాలి : యుటిఎఫ్



డిఇఒకు వినతిపత్రం ఇస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): విద్యాశాఖ అధికారుల అసంబద్ధ నిర్ణయాలను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ కృష్ణాజిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా విద్య శాఖ అధికారి పి.వి.జె.రామారావుకు వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వ పరిపాలనకు, ఈ ప్రభుత్వ పరిపాలనకు పెద్దగా తేడా లేదనే విధంగా విద్యాశాఖ అధికారుల నిర్ణయాలు ఉంటున్నాయని ,పాఠశాలల పనివేళల పెంపు, 10 శాతం మించి ఉపాధ్యాయులు సెలవులు పెట్టరాదనే ఆంక్షలు, 10వ తరగతి పరీక్షలకు సంసిద్ధత పేరుతో విడుదల చేసిన 100 రోజుల యాక్షన్ ప్లాన్, విద్యార్థులు వివరాలు అపార్లో నమోదు,ఇలా ప్రతి ఒక్క నిర్ణయం అసంబద్ధంగానే ఉంటున్నాయన్నారు. ముఖ్యంగా మండలాల్లో 10 శాతం మించి ఉపాధ్యా యులు సెలవులు పెట్టరాదని మండల విద్యాశాఖాధికారులు అత్యవసర సందర్భాల్లో కూడా సెలవులు మంజూరు చేయడం లేదని ,ఆనారోగ్యం బారిన పడినవారికి సైతం సెలవులు మంజూరు చేయకపోవడంతో ఉపాధ్యాయులు ఆందోళనకు గురి అవుతున్నరన్నారు. ఇప్పటికే విద్యార్థుల అపార్ నమోదు విషయంలో ఉపాధ్యాయులు పలు ఇబ్బందులు పడుతున్నరన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వంద రోజుల యాక్షన్ ప్లాన్లో ఆదివారాలు, పండుగ దినాల్లో సైతం పనిచేయాలంటూ ఇచ్చిన ఉత్తర్వుల పట్ల ఉపాధ్యాయులు తీవ్ర అసంతప్తి వ్యక్తం చేస్తున్నరన్నారు.ఈ అసంబద్ధ నిర్ణయాలు ఉపాధ్యాయులను తీవ్ర ఆందోళనకు, మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నాయని, కాబట్టి విద్యాశాఖ అసంబద్ధ నిర్ణయాలను రద్దు చేయాలనే డిమాండ్తో ఆంధ్రప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటియఫ్) రాష్ట్రమంతటా నిరసన ప్రదర్శనలు చేపట్టాలని నిర్ణయించిందన్నారు.కావున, మా విజ్ఞప్తి పరిశీలించి విద్యాశాఖ నిర్ణయాలను పునఃసమీక్షించాలని, ఒత్తిడి లేని వాతావరణంలో ఉపాధ్యాయులు స్వేచ్ఛగా పనిచేసే విధంగా అధికారులు నిర్ణయాలు ఉండాలని లేని యెడల మా పోరాటాన్ని మరింత ఉధతం చేస్తామని హెచ్చరించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో యుటిఎఫ్ కృష్ణాజిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి కనకారావు, జె లెనిన్‌బాబు, సహాధ్యక్షులు ఎండి షౌకత్ హుస్సేన్, జిల్లా కార్యదర్శి రాజా శ్రీధర్, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు జె ప్రసాద్‌రావు, అవనిగడ్డ మండల శాఖ అధ్యక్షులు కె జీవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలపై కలెక్టర్‌కు ఎంఎల్‌ఎ వసంత వినతి


కలెక్టర్ లక్ష్మీశకు వినతిపత్రం ఇస్తున్న ఎంఎల్ఎ వసంత

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లి గ్రామానికి చెందిన రైతుల సమస్యలపై మైలవరం ఎంఎల్‌ఎ వసంత వెంకట కృష్ణప్రసాద్ కలెక్టర్ జి.లక్ష్మీశను కలిశారు. విజయవాడలోని కలెక్టరేట్ కార్యాలయంలో బుధవారం ప్రత్యేకంగా కలిశారు. ఈ సందర్భంగా రైతులకు సంబంధించిన సమస్యలతో పాటు, వాటి వల్ల రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, పలు బహిరంగ ప్రయోజనాల గురించి కలెక్టర్‌కి సమగ్రంగా వివరించారు. వారి సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని కోరారు. దీనిపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ అన్నదాతల సమస్యలను ప్రభుత్వ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగు చర్యలు చేపడతామని పేర్కొన్నట్లు రైతులు తెలిపారు. గుంటుపల్లికి చెందిన రైతులు పాల్గొన్నారు.

8న సదస్సును జయప్రదం చేయండి

సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ.కమల



మాట్లాడుతున్న కమల

ప్రజాశక్తి - పెనుగంచిప్రోలు : 8న నిర్వహించనున్న భవన నిర్మాణ రంగ మహిళా కార్మికుల జిల్లా సదస్సును జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ.కమల పిలుపునిచ్చారు. మండలంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. భవన నిర్మాణ రంగంలో, తాపీ, స్లాబ్ ముఠా, మట్టి పని, కాంక్రీట్, తదితర పనుల్లో మహిళలు గణనీయంగా పనిచేస్తున్నారని, అత్యధిక మంది శారీరక శ్రమతో కూడిన పనులు చేస్తున్నా, ఈ మహిళా కార్మికులకు, ప్రభుత్వం నుండి ఎలాంటి ప్రత్యేక పథకాలు, సౌకర్యాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమ బోర్డు ద్వారా వేతనం చెల్లించాలని, అంతేకాక గర్భిణులకు ప్రసవానికి ముందు ఒక నెల, ప్రసవం తర్వాత మూడు నెలలు చొప్పున, మొత్తం నాలుగు నెలలు సెలవు ఇచ్చి సంక్షేమ బోర్డు ద్వారా వేతనం చెల్లించాలని ఆమె కోరారు. మహిళా కార్మికుల సమస్యల గురించి చర్చించి, కార్యాచరణ రూపొందించేందుకు జిల్లా సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న మహిళా కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెనుగంచిప్రోలు మండలం సిఐటియు కార్యదర్శి దార నాగేశ్వరరావు, భవన నిర్మాణ కార్మికులు బాణావత్ బుచ్చయ్య, కట్ట పార్వతి,ఎ.దాసు తదితరులు పాల్గొన్నారు.

రోజుకో వివాదం సృష్టిస్తున్న అరాచకశక్తులు : అల్తాఫ్ బాబా



ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : 850 సంవత్సరాల చరిత్ర కలిగి భారతదేశంలో ఎంతో ప్రాముఖ్యత కలిగిన అజ్మీర్ దర్గా ఖాజా గరీబ్ నవాజ్ దర్గాను వివాదాస్పదం చేయటం ఎంతోమంది హిందూ, ముస్లిముల మనోభావాలు దెబ్బతీయటమే అవుతుందని అహలే సున్నతుల్ జమాత్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కో కన్వీనర్ అల్తాఫ్ బాబా తెలిపారు. బుధవారం కొండపల్లిలోని షాబుఖారీ దర్గాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రశాంతమైన భారతదేశంలో రోజుకో వివాదంతో ముందుకు వెళ్తున్న అరాచక శక్తుల ఉద్దేశం ఏమిటో అర్థం కాని పరిస్థితిలో ఉందన్నారు. రామరాజ్యం అంటే అందరూ సుఖంగా సంతోషంగా ప్రేమాభిమానాలతో శాంతి సౌభాగ్యాలతో జీవించడమే కదా, రాక్షసత్వాన్ని పెంచి పోషించి రోజుకో వివాదంతో ముందుకు వెళ్తున్న దుర్మార్గమైన చర్యలకు ఏదో విధంగా ముస్లింలను రెచ్చగొట్టి అలజడి సృష్టించాలనుకుంటున్న అరాచక శక్తుల పతనం అజ్మీర్ దర్గాతో మొదలవడం ఖాయమని హెచ్చరించారు. బాబ్రీ మసీదు మాత్రమే తమ లక్ష్యమని, దానిని అడ్డం పెట్టుకొని ప్రతి మసీదు, దర్గా కింద శివలింగాలు ఉన్నాయని వివాదాలు సృష్టించొద్దని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ స్వయంగా చెప్పినా కావాలని కొన్ని దుష్టశక్తులు ముస్లిం సామాజిక వర్గాన్ని రెచ్చగొడుతున్నారంటే భారీ కుట్ర దాగి ఉందని అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు.

కృష్ణా వర్సిటీ అంతర్ కళాశాలల పోటీలు...

లీగ్ దశకు పురుషుల వాలీబాల్ టోర్నీ



ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : విజయవాడ రూరల్ మండలం నున్నలోని వికాస్ విద్యాసంస్థల ఆవరణలో విజయ ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీ ఆధ్వర్యంలో జరుగుతున్న కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల పురుషుల వాలీబాల్ పోటీలు లీగ్ దశకు చేరుకున్నాయి. వికాస్ బిపిఇడి కాలేజీ, నున్న, బిపి సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ, విజయవాడ, లకిరెడ్డి హనిమిరెడ్డి డిగ్రీ కాలేజీ, మైలవరం, ఎస్ఆర్ఆర్ అండ్ సివిఆర్ ప్రభుత్వ కళాశాల, విజయవాడ జట్లు లీగ్‌కు చేరుకున్నాయి. రెండు రోజులపాటు జరిగే ఈ పోటీలను రాష్ట్ర క్రీడా ప్రాధికారసంస్థ (శాప్) మాజీ చైర్మన్ డాక్టర్ పి.అంకమ్మ చౌదరి బుధవారం ప్రారంభించారు. కృష్ణా యూనివర్సిటీ పరిధిలోని కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల నుంచి పది పురుషుల జట్లు ఈ పోటీలో పాల్గొన్నాయి. నాకౌట్ కమ్ లీగ్ విధానంలో పోటీలు నిర్వహించారు. నాకౌట్‌లో నాలుగు జట్లు విజయం సాధించి లీగ్‌కు చేరుకున్నాయి. అంతముందు జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో శాప్ మాజీ చైర్మన్ డాక్టర్ అంకమ్మ చౌదరి, వికాస్ గ్రూపు ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ అధినేత నరెడ్ల సత్యనారాయణరెడ్డి క్రీడాకారుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా అంకమ్మ చౌదరి మాట్లాడుతూ అంతర్జాతీయ పోటీలతోపాటు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించిన క్రీడాకారులకు ఇచ్చే నగదు పురస్కారాను ప్రభుత్వం భారీగా పెంచిందన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా ప్రావీణ్యం సంపాదించాలని, క్రీడా ప్రతిభ ఆధారంగా ఉద్యోగావకాశాలు కూడా లభిస్తాయన్నారు. జాతీయస్థాయిలో పతకాలు సాధిస్తే కనీసం రూ.లక్ష నుంచి రూ.10 లక్షల నగదు పురస్కారాలు దక్కే అవకాశం ఉందని, దీనిని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ పరిశీలకుడు డాక్టర్ బిసిహెచ్.సంగీతరావు, విజయ బిపిఇడి కళాశాల ప్రిన్సిపాల్ బి.ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వరద సాయం అందజేయాలి

సిఎంకు సిపిఎం వినతి



ప్రజాశక్తి - విజయవాడ : వరద బాధితులకు ప్రకటించిన విధంగా సాయం అందజే యాలని కోరుతూ బాధితులు సిపిఎం ఆధ్వర్యంలో సిఎం చంద్రబాబుకు వినతిపత్రం అందజేశారు. టిడిపి కేంద్ర కార్యాలయం, ఎన్‌టిఆర్ భవన్లో ప్రజావేదిక కార్యక్రమంలో భాగంగా సిఎంను కలిసి బుధవారం వినతిపత్రం అందించారు. సిపిఎం నగర నాయకులు చింతల శ్రీనివాస్, ఎస్.కె.పీరు సాహెబ్ సిఎంను కలిశారు. వారు మాట్లాడుతూ విజయవాడ సింగ్ నగర్ ప్రాంతంలో వరదలు వచ్చి 95 రోజులు గడిచినా వరద బాధితులకు అందాల్సిన సహాయం అందలేదన్నారు. సెప్టెంబర్‌లో వచ్చిన భారీ వర్షాలతో బుడమేరు వల్ల విజయవాడ ప్రజానీకానికి తీవ్రనష్టాన్ని చేకూర్చాయన్నారు. ఇంకా 25శాతం మంది బాధితులకు నష్టపరిహారం అందాలన్నారు. బాధితులు పలు దఫాలుగా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ కలెక్టర్ కార్యాలయం, తహశీల్దార్ కార్యాలయాల్లో, సచివాలయాల్లో అర్జీలు ఇచ్చి ఉన్నారన్నారు. మరోసారి పరిశీలించి బాధితులకు లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని కోరారు.




నందిగామలో మహిళా పోలీసులను అభినందిస్తున్న దృశ్యం

మహిళా పోలీసులకు అభినందన

ప్రజాశక్తి - నందిగామ : క్రీడల్లో బహుమతులు పొందిన గ్రామ సచివాలయ మహిళా పోలీసులను నందిగామ ఎసిపి తిలక్, సిఐ నాయుడు అభినందించారు. నందిగామ, కేతవీరునిపాడు, చందాపురం, అడవిరావులపాడు గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న సచివాలయ మహిళా పోలీసులు విజయవాడలో పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో జరిగిన వివిధ రకాలైన క్రీడల్లో ఉత్తమ ప్రతిభను కనపరిచారు.

విశ్రాంత న్యాయమూర్తి సత్యనారాయణ రెడ్డికి పలువురు నివాళి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : కృష్ణాజిల్లా విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి, అభ్యుదయవాది, వామపక్ష శ్రేయోభిలాషి దుగ్గిరాల సత్యనారాయణ రెడ్డి మృతికి పలువురు నేతలు, న్యాయవాదులు, అభ్యుదయవాదులు సంతాపం తెలిపారు. ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. గత కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన నగరంలోని ఎల్ఐసి కాలనీ 2వ లైన్ జయప్రకాష్ నగర్‌లోని స్వగృహంలో మరణించారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దొనేపూడి కాశీనాథ్, విజయవాడ తూర్పు సిటీ కార్యదర్శి పుప్పాల కృష్ణ, సిటీ నాయకులు జి.క్రాంతికుమార్, మురహరి తదితరులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలియజేశారు. పెన్షనర్స్ సంఘం నాయకులు దాలినాయుడు, నరసింహారెడ్డి, బ్రహ్మం, సాహితీ ప్రముఖులు తాటి. శ్రీకృష్ణ, గోళ్ల నారాయణరావు, ప్రజాశక్తి బుక్‌హౌస్ జనరల్ మేనేజర్ కె.లక్ష్మయ్య, మోతుకూరి వెంకటేశ్వరరావు, అరుణ కుమార్, నాయకులు వీర బాబు, రఘు, జగన్, ఏంవి ఆంజనేయులు తదితరులు నివాళులర్పించారు.



సత్య నారాయణరెడ్డి భౌతికకాయం వద్ద నివాళు లర్పిస్తున్న దోనేపూడి కాశీనాథ్, పి.కృష్ణ తదితరులు

మౌలిక సదుపాయాల వృద్ధికి టాటా తోడ్పాటు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : పెద్ద ఎత్తున పెట్టుబడులు, ప్రాజెక్టులు కీలక పరిశ్రమలకు ఉత్పాదక శక్తి కేంద్రంగా మారడంతో గణనీయమైన మౌలిక సదుపాయాల వృద్ధికి టాటా ట్రక్కుల మద్దతు ఇస్తుందని సంస్థ బిజినెస్ హెడ్ రాజేష్ కౌల్ తెలిపారు. నగరంలోని టాటా మోటార్స్ కార్యాల యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. మైనింగ్, లాజిస్టిక్స్ కార్యకలాపాల్లో కార్గో, నిర్మాణ సామగ్రి మొదలైన వాటి తిరుగులేని మొబిలిటీకి మద్దతు ఇవ్వడానికి నమ్మకమైన హెవీ డ్యూటీ ట్రక్కులను డిమాండ్ చేస్తాయన్నారు. ఎపి ప్రతిష్టాత్మకతకు మద్దతుగా నిర్మించబడిన తన విస్తృత శ్రేణి ఇంధన సమర్థవంతమైన, విశ్వసనీయ, సురక్షితమైన వాణిజ్య వాహనాలతో డిమాండ్‌ను తీర్చడానికి టాటా మోటార్స్ సిద్ధంగా ఉందన్నారు. తమ ఉత్పత్తులు, కస్టమర్ కేంద్రిత విధానం, వినూత్న పరిష్కారాలతో రాష్ట్ర పురోగతికి సహాయపడటంలో సమగ్ర పాత్రను పోషిస్తామని అన్నారు.

విద్యార్థులకు సామాగ్రి పంపిణీ

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కేతనకొండ గ్రేస్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బకెట్లు, తినుబండారాలు, దుప్పట్లు అందజేశారు. ఇబ్రహీంపట్నం ఫెర్రీలో ఉన్న మానసిక పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రేస్ మినిస్ట్రీస్ డైరెక్టర్ మోగులూరి ఎలీషా మాట్లాడుతూ ప్రతి సంవత్సరం డిసెంబర్ 3న ఈ కార్యక్రమం నిర్వహించబడుతుందని వికలాంగుల హక్కులు, వారి శ్రేయస్సు కోరి వారిని ప్రోత్సహించడానికి మానసికంగా బాధపడుతున్న విద్యార్థులకు చేతనైన సహాయం చేయడానికి గ్రేస్ మినిస్ట్రీస్ సిద్ధంగా ఉందని అన్నారు. సమాజంలో చేయవలసిన సేవ ఎంతో ఉందని, మానసిక విద్యార్థులను సమాజం చిన్న చూపు చూడకూడదని, వారిని అభినందించాలని వారి కొరకు దేవుని ప్రార్థించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రేస్ మినిస్ట్రీస్ సెక్రటరీ సుమలత పౌలు, అనిల్, పాఠశాల హెచ్ఎం నరసమ్మ, టీచర్లు ఉషారాణి, చంద్రవతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలి

ప్రజాశక్తి - వత్సవాయి : ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని పెనుగంచిప్రోలు ఎస్ఐ కె.అర్జున్ అన్నారు. మండలంలోని ముళ్లపాడు క్రాస్ రోడ్డు వద్ద జాతీయ ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ హెల్మెట్ ధరిస్తే ప్రమాద సమయాల్లో ప్రాణాలు కోల్పోకుండా కాపాడుకోవచ్చని తెలిపారు. మైనర్‌లో వాహనాలు నడపకూడదని అలా నడిపితే తల్లిదండ్రులపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. ఆటోలో కూడా పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని అన్నారు. హెల్మెట్ ధరించి ప్రయాణిస్తున్న వాహనదారులకు బహుమతులందజేశారు.